

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కరీంనగర్

శుక్రవారం | నవంబర్ 03, 2023 | www.navatelangana.com

నేటి నుండి

నామినేషన్ల పర్వం షురూ!



- 10వ తేదీ గడువులోపు ముహూర్తాలు చూసుకున్న అభ్యర్థులు
- 3, 4, 8, 9 తేదీల్లో ఏదో ఒకటి ఎంపికకు కసరత్తు
- భారీ ర్యాలీలతో వెళ్లేందుకు సమాయత్తం
- రాత్రుళ్లు వ్యూహాలు.. పగలు ప్రచారాలు
- పోలింగ్ తేదీ నాటికి షెడ్యూల్ రూపొందించుకున్న అభ్యర్థులు
- కాంగ్రెస్ రెండు, బీజేపీ మూడుస్థానాల్లో ఖరారుకాని అభ్యర్థులు
- బీజేపీ మూడో విడతలో కేవలం మంథని అభ్యర్థి ఖరారు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

మిగతా 2లో..

మోడీకి ప్రయివేటైజేషన్ పిచ్చిపట్టుకుంది



- ప్రధాని రాష్ట్రంలోనే 24గంటల కరెంటు లేదు...
- 50ఏండ్లు పాలించిన కాంగ్రెస్‌కు ఇంకా ఒక్క చాన్స్ ఎందుకు?
- తెలంగాణ వచ్చిన కొత్తలో చిమ్మచీకట్లు
- నాటికి నేటికీ తేడాను ప్రజలు గమనించాలి
- హుజూరాబాద్ తరహాలో నియోజకవర్గ మొత్తానికి 'దళితబంధు'
- ధర్మపురి ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

వివరాలు 2వ పేజీలో...

ప్రధాన పార్టీలను వదిలి బీఎస్పీలోకి వలసలు

- టీపీసీసీ కార్యదర్శి ఈర్ల కొమురయ్య, పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రామ్మూర్తి బీఎస్పీలో చేరిక
- పెద్దపల్లి నియోజకవర్గంలో పుంజుకుంటున్న బీఎస్పీ

వివరాలు 8 లో...

నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సమర్పించాలి

కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

2లో..



నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సమర్పించాలి

కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

నవతెలంగాణ-కరీంనగర్



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2023లో పోటీ చేసే అభ్యర్థులు వారి నామినేషన్లను స్వయంగా సంబంధిత రిటర్నింగ్ అధికారుల కార్యాలయంలో అందించాలని కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నవంబర్ 3 నుంచి అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మొదలు కానున్న దృష్ట్యా ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు వారి నామినేషన్ పత్రాలను ఆయా నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని, సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తును సమర్పించినప్పటికి అప్లికేషన్ సక్సెస్ అయిన తర్వాత వచ్చే పత్రాలపై అభ్యర్థి స్వయంగా సంతకం చేసి ఆ కాపీలను ఆర్వో కార్యాలయంలో సమర్పించాలన్నారు. నామినేషన్ దాఖలుకు ఒకరోజు ముందు అభ్యర్థి పేరున ఎన్నికల ఖర్చుల కోసం కొత్తగా బ్యాంక్ ఖాతాను ప్రారంభించాలని, ఖాతాకు సంబంధించిన వివరాలను ఆర్వో కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో చొప్పదండి, మానకొండూర్, కరీంనగర్, హుజురాబాద్ ఆర్వోలు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, కె.మహేశ్వర్, రాజు, జిల్లా రెవెన్యూ అధికారి పవన్ కుమార్, ఏసీపీ అడ్మిన్ లక్ష్మీ నారాయణ, బీఎస్పీ ప్రతినిధి సిరిసిల్ల అంజయ్య, బీజేపీ ప్రతినిధి బి.రమణరెడ్డి, సీపీఐ(ఎం) ప్రతినిధి మిల్కూరి వాసుదేవరెడ్డి, కాంగ్రెస్ ప్రతినిధి మడుపు మోహనచారి, ఎస్‌కె.సిరాజ్ హుస్సేన్, ఎంఐఎం ప్రతినిధి సయ్యద్ బర్కత్ అలీ, మెహ్మద్ అబ్బాస్ సమి, బీఆర్ఎస్ ప్రతినిధి శ్రీనివాస్, టీడీపీ ప్రతినిధి కళ్యాడపు ఆగయ్య పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి

పోలింగ్ రోజున విధులలో ఉండి ఓటు హక్కును వినియోగించుకోలేని వారందరికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2023 కోసం ఏర్పాటు చేసిన వివిధ విభాగాల నోడల్ అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి/ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు-2023 పోలింగ్ రోజున విధులలో ఉండి ఓటు హక్కును వినియోగించుకోలేని వారందరికి పోస్టల్ బ్యాలెట్ ఫారం 12డీ అందించాలని సంబంధిత విభాగాల నోడల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చొప్పదండి, మానకొండూర్, కరీంనగర్, హుజురాబాద్ ఆర్వోలు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, కె.మహేశ్వర్, రాజు, జిల్లా రెవెన్యూ అధికారి పవన్ కుమార్, ఏసీపీ అడ్మిన్ లక్ష్మీనారాయణ, వివిధ విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల పర్వం షురూ!

(మొదటి పేజీ తరువాయి)

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

నేటి నుంచే అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. ఈనెల 3 నుంచి 10వ తేదీలోపు గడువు విధించడంతో అభ్యర్థులు తమకు విజయం సిద్ధించే తిథి, నక్షత్రబలం చూయించుకుని మరీ నామినేషన్ తేదీలు ఖరారు చేసుకున్నారు. ఇందులో ప్రధానంగా 3, 4, 8, 9 తేదీల్లోనే నామినేషన్లు వచ్చే పరిస్థితి ఉండగా.. అభ్యర్థులు నెల రోజుల ప్రచార ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. రాత్రంతా వ్యూహాలు.. పగలంతా ప్రచారానికి తిరిగేలా పక్కా ప్లాన్‌ను తయారు చేసుకున్నారు. ఈనేపథ్యంలో ఇప్పటికే కాంగ్రెస్ రెండు స్థానాల్లో, బీజేపీ మూడు స్థానాల్లో అభ్యర్థులను ఇంకా ఖరారు చేయకపోవడం గమనార్హం. గురువారం విడుదలైన కమలం పార్టీ మూడో జాబితాలో కేవలం మంథని అభ్యర్థిగా చందుపట్ల సునిల్‌రెడ్డి పేరును ఖరారు చేసింది.




శుక్రవా రం విడుదల కానున్న ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో అదే రోజు నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాబోతోంది. దీంతో ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లనూ చేసింది. ఆయా నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల నుంచి నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అందులో కేవలం 5న ఆదివారం నామినేషన్ల కార్యక్రమానికి సెలవుగా ఉంది. ఎక్కడా వివాదాలు లేకుండా, పారదర్శకత కోసం ఆర్డీవో కార్యాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నామినేషన్ల స్వీకరణ 3న మొదలై 10వ తేదీ వరకు కొనసాగనున్నది. 13న నామినేషన్ల పరిశీలన, 15 వరకు ఉపసంహరణ ఉంటుంది. అనంతరం అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. 30న ఓటింగ్ జరుగనున్నది. ఇదిలా ఉండగా.. ఎన్నికల కమిషన్ ఈ సారి పలు మార్పులు చేసింది. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్లు దాఖలు చేసే అవకాశం ఉండగా.. అఫిడవిట్ అసంపూర్తిగా ఉంటే.. రిటర్నింగ్ అధికారి సదరు అభ్యర్థికి నోటీసులు జారీ చేసి.. సవరించాల్సిందిగా సూచిస్తారు. అభ్యర్థి స్పందించకుంటే నామినేషన్ తిరస్కరించేందుకు అవకాశం ఉంటుంది. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద 114 సెక్షన్ విధించారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ బలాన్ని చూపించుకునేందుకు భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్లు వేసేందుకు ప్లాన్ చేసుకున్నారు. ఇదే సమయంలో తమ కుటుంబసభ్యుల పేరు మీద కూడా డమ్మీ నామినేషన్లు వేయనున్నారు. ఒకవేళ నామినేషన్ పత్రాల పరిశీలనలో తిరస్కరణకు గురైతే వారి కుటుంబసభ్యులను బరిలో దింపేందుకు సిద్ధమయ్యారు.

రాత్రుళ్లు వ్యూహాలు.. పగలు ప్రచారాలు

అభ్యర్థులు ఖరారుఅయిన నియోజకవర్గాల్లో రాత్రంగా వ్యూహాలు రచించుకుంటున్నారు. ఇప్పటికే కుల సంఘాల వారీగా, ఉద్యోగ, కార్మిక సంఘాల వారీగా, కమ్యూనిటీల వారీగా సమావేశాలయ్యారు. ముఖ్యంగా ప్రచారానికి మహిళలను పోగేందుకు మహిళాసంఘాలనూ ప్యాకేజీల కింద సంప్రదించారు. అసంతృప్తులు, పార్టీని వీడే వారి పట్ల క్షుణ్ణంగా పరిశీలిస్తూ వారిని బుజ్జగించే పనిలో పడ్డారు. తమ అనుచరులు, కార్యకర్తలను సమాయత్తం చేసుకుని నేటి నుంచి ప్రచారరంగంలోకి దిగబోతున్నారు. ఇప్పటికే ప్రత్యేక గీతాలతో పార్టీలు, అభ్యర్థుల గుణగణాలు, హామీలు, పథకాలు వంటి వాటితో రికార్డు చేయించిన పాటలను వాహనాల ద్వారా ఆయా గ్రామ, పట్టణ వాడల్లో మార్మోగిస్తున్నారు. మరోవైపు కొందరు అభ్యర్థులు అయితే ఎల్ఈడీ తెరలపై అభ్యర్థుల హామీలు, మేనిఫెస్టో, నేపథ్యం చాటేచిత్రాలు, వీడియోలతో బ్యాగ్రౌండ్‌లో పాటలను మోగిస్తున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారరథాలే గ్రామగ్రామాన, పట్టణాల్లో తిరుగుతుండగా.. అక్కడక్కడ మాత్రమే బీజేపీ అభ్యర్థులు ప్రచారరథాలు తిరుగుతున్నాయి. మొత్తంగా నేటి నుంచి పోలింగ్ తేదీ ముందు వరకు తిరగాల్సిన గ్రామాలు, పట్టణాలు, ఆయా వార్డులు, కలవాల్సిన జనం, అందుకు జనాన్ని పోగేయాల్సిన బాధ్యతలను వంటి వివరాలను సిద్ధం చేసుకున్నారు. నేటి నుంచి అభ్యర్థులు రోజంతా జనంలోనే తిరగాడనున్నారు.

కాంగ్రెస్ రెండు, బీజేపీ మూడుస్థానాల్లో ఖరారుకాని అభ్యర్థులు

నామినేషన్లు నేటి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండు స్థానాల్లో కాంగ్రెస్, మూడు స్థానాల్లో బీజేపీ ఇంకా అభ్యర్థులను ఖరారు చేయలేదు. సిరిసిల్ల, కరీంనగర్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరనే స్పష్టత ఇంకా రాలేదు. అందులోనూ సిరిసిల్లలో కేకే మహేందర్‌రెడ్డి తప్ప పోటీగా ఏ ఒక్క ఆశావహుడూ లేకపోయినా అక్కడ ఎవరు పోటీ చేస్తారో తేల్చలేదు. మరోవైపు కరీంనగర్‌లో 'హస్తం' టిక్కెట్ కొత్త జయపాల్‌రెడ్డికే అని అందరూ అనుకున్న సమయంలో ఆయన అనూహ్యంగా కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఇక మిగిలిన ఆశావహుల్లో బొమ్మకల్ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్, పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తుండగా.. అక్కడ పార్టీ గెలిచే పరిస్థితి పెద్దగా లేదనే భావనకు పార్టీ హైకమాండ్ వచ్చినట్టు తెలుస్తోంది.దీంతో పార్టీ విధేయుడిగా ఉన్న నరేందర్‌రెడ్డికి టిక్కెట్ ఇచ్చే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. ఇక బీజేపీకి సంబంధించి వేములవాడ, పెద్దపల్లి, హుస్నాబాద్ స్థానాల్లో ఇంకా అభ్యర్థులను ఖరారు చేయకపోవడం గమనార్హం. మిగిలిన స్థానాల్లో ప్రకటించిన అభ్యర్థుల్లో ప్రధాన పోటీదారునిగా ఉంటారనుకునే ఇద్దరు ఎంపీలు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్ ఇంకా జనంలోకి రాలేదు. ఈటల రాజేందర్ కేవలం ఒకట్రెండు చోట్ల మాత్రమే ప్రచారాన్ని ప్రారంభించారు. ఇక మిగిలిన స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల ప్రచార హడావిడి పెద్దగా లేకపోవడం గమనార్హం.



మోడీకి ప్రయివేటైజేషన్ పిచ్చిపట్టుకుంది

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని రాష్ట్రంలో కూడా 24 గంటల కరెంట్ ఇస్తలేరు.. మోడీకి ప్రయివేటైజేషన్ పిచ్చిపట్టుకుంది. కరెంటుతో సహా ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రయివేటుపరం చేస్తున్నడు. 50ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఇప్పుడు ఒక్క చాన్స్ అని అడుగుతోంది. 11, 12 చాన్స్‌లు ఇచ్చాం.. ఇప్పుడు ఒక్క చాన్స్ ఇస్తే ఏం చేస్తారు? ప్రజలు తెలంగాణ వచ్చినంక వచ్చిన తేడాను గమనించాలని సీఎం కేసీఆర్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా ధర్మపుని నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం.. అదే భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. 50ఏండ్లు పాలించిన కాంగ్రెస్ మళ్లీ ఎందుకని ఒక్క చాన్స్ దేనికి అడుగుతోంది.. పంటికి అంటకుండా మింగుదామనా.. అంటూ ధ్వజమెత్తారు. గతంలో ఎమ్మెల్యేలు అయ్యారు కానీ వారు ధర్మపురి అభివృద్ధి చేయలేదని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈశ్వర్ హయాంలో అభివృద్ధి జరిగింది..



వెంటపడి రోళ్లవాగు ప్రాజెక్టు పూర్తి చేపించిండు.. ఇప్పుడు 1 లక్ష 30 వేల ఎకరాలు సాగవుతోందని తెలిపారు. వాగులపై చెక్ డ్యాంలు కట్టించారు. మిషన్ కాకతీయ కింద చెరువులను బాగు చేసుకున్నాం. తెలంగాణ వచ్చిన కొత్తలో చిమ్మచీకట్లు, మంచి, సాగునీళ్లు లేవు. వలస బతుకులు, ఎక్కడ చూసినా అంధకారమే. మూడు నాలుగు నెలలు మెదడును రంగరించి, అనేక కార్యక్రమాలు అమలు చేశాం. ఇప్పుడు కరెంట్, తాగు నీటికి ఇబ్బంది లేదు. సాగునీటి సమస్యను పరిష్కరించుకున్నాం. అంతకుముందు రైతుబంధు లేదు.. రాబందులే తప్ప రైతుబంధులు లేరన్నారు. కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తే హుజూరాబాద్ తరహాలో ఒకేసారి నియోజకవర్గం మొత్తానికి దళితబంధు పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ధర్మపురి సభతో ఈశ్వర్ రిజల్ట్ డిక్లేర్ అయిందన్నారు. ధర్మపురి ఆలయ అభివద్ధికి రూ.100కోట్లు మంజూరు చేసుకున్నాం. పనులు జరుగుతున్నయ్.. ఇంకా జరగాల్సి ఉంటే.. మరిన్ని నిధులు మంజూరు చేసి అద్భుతమైన పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. కొప్పుల ఈశ్వర్ సౌమ్యుడు. కార్మికుడిగా పని చేసి పైకి వచ్చిన వ్యక్తి. ఎవరినీ ఒకమాట కూడా గట్టిగా మాట్లాడని వ్యక్తి. ఈశ్వర్‌లాంటి వ్యక్తి గెలిస్తే ధర్మపురి చాలా అద్భుతంగా ముందుకు వెళు తుందని, కారు గుర్తుకు ఓటేసి బ్రహ్మాండమైన మెజారిటీతో ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ ధర్మపురి నియోజవర్గ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. గతంలో తాగు, సాగు నీరు లేక ధర్మపురి నియోజకవర్గం అల్లాడింది. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ధర్మపురి అభివద్ధి కోసం ఎన్నో కోట్లు వెచ్చించి అభివద్ధి చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదిస్తే ప్రజల కష్ట, సుఖాల్లో పాలుపంచుకొని సేవ చేస్తానన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

అభ్యర్థులు నియమనిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ఎస్.రాజు

నవతెలంగాణ - హుజురాబాద్

నామినేషన్లు దాఖలు చేసే వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని హుజూరాబాద్ రిటర్నింగ్ అధికారి ఎస్.రాజు అన్నారు. గురువారం హుజురాబాద్ పట్టణ శివారు కేసీ క్యాంపులోనీ ఆర్డీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నియమాల ప్రకారం ఈ నెల మూడవ తేదీ నుండి పదవ తేదీ వరకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. పోటీ చేసే అభ్యర్థుల సౌకర్యార్థం వివరాలు తెలుసుకోవడానికి ఆర్డీఓ కార్యాలయంలో ఒక కౌంటర్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేషన్లు వేసేందుకు గాను ఫారం టు బిని ఉచితంగా అందిస్తామని, ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్ వేయవచ్చని చెప్పారు. ఫారం 26ను పూర్తిగా నింపాలని, పోటీ చేసే జనరల్ బిసి అభ్యర్థులు 10,000 డిపాజిట్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 5వేల రూపాయలు డిపాజిట్ కౌంటర్లో చెల్లించాలని అన్నారు. హుజురాబాద్‌లో ఇటీవల జతచేసిన ఓట్లతో కలిపి 2,44,514 ఓటర్లు ఉన్నారని.. ఇందులో పురుషులు 1,19,676, మహిళలు 1, 24,833, ట్రాన్స్ జెండర్లు ఐదుగురు ఉన్నారని తెలిపారు. మొత్తం 305 పోలింగ్ స్టేషన్లో ఉండగా 82 గ్రామాలు అత్యంత సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించినట్లు వివరించారు. ఎన్నికలు జరిగే సమయంలో 153 వెబ్ కెమెరాలను అమర్చినట్లు ఆయన తెలిపారు ఇప్పటివరకు మొత్తం 732 మందికి ఎన్నికల నిర్వహణ కోసం శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఓటరుగా నమోదై ఓటర్ కార్డు లేని వారికి ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులు అందిస్తామన్నారు. సమావేశంలో సహాయ ఎన్నికల అధికారులు విజయ్ కుమార్, మాధవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు కష్టాలు తప్పవు

బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్



నవతెలంగాణ - శంకరపట్నం

కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు కష్టాలు తప్పవని బీఆర్ఎస్ మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. గురువారం శంకరపట్నం మండలంలోని రాజపూర్, కన్నాపూర్, ధర్మారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు బతుకమ్మలు, బోనాలు, కోలాటాలతో అపూర్వ స్వాగతం పలికారు. కన్నాపూర్ గ్రామంలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరగా గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు రైతు ఆత్మహత్యలు ఉండేవని, సాగునీళ్ల లేక పంటలు కండ్ల ముందే ఎండిపోతే రైతులు పంట పొలాల్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు ఉండేవని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మైపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఉమ్మడి జిల్లా తృతీయ స్థానం

నవతెలంగాణ - కరీంనగర్

హనుమకొండలో జరిగిన 67వ రాష్ట్ర స్థాయి పాఠశాలల అండర్-14 బాల బాలికల జూడో ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలికల జట్టు అద్వితీయ ప్రతిభ కనబరిచి తృతీయ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. జిల్లా బాలికల జట్టు 3 రజత పతకాలు, 2 కాంస్య పతకాలతో మొత్తం 11 పాయింట్లు సాధించి తృతీయ ఛాంపియన్‌ను కైవసం చేసుకుంది. జిల్లా జట్టులో సాత్విక, స్వాతి, శివాని, మన్విత, సంధ్య పతకాలను కైవసం చేసుకున్నారు. జిల్లా జట్టుకు కోచ్ మేనేజర్లుగా ఎల్.వెంకట రమణ, సిలివేరి మహేందర్, ఎం.శ్రీధర్ కుమార్ వ్యవహరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్.జనార్దన్‌రావు, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజ వీరు, జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి పోతన శ్రీనివాస్, జిల్లా జూడో సంఘం అధ్యక్షుడు కడారి అనంత రెడ్డి, ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, పలు క్రీడా సంఘాల బాధ్యులు పీఈటీలు, పీడీలు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ - గన్నేరువరం

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై చందా నరసింహారావు అన్నారు. గురువారం మండలంలోని కాసింపేట గ్రామంలో ప్రజలకు ఎన్నికల నియమావళి, కోడ్ ఉల్లంఘన, పర్మిషన్ లేని ర్యాలీలు, సభలపై అవగాహన కల్పించారు. ఎన్నికల నిబంధన ప్రకారం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు నడుచుకోవాలని కోరారు. అల్లర్లు, గొడవలకు దారి తీస్తే కఠిన చర్యలు తప్పవని సూచించారు. శాంతియుత వాతావరణంలో సజావుగా ఎన్నికలను నిర్వహించుకోవాలని, పోలీస్‌లకు సహకరించాలని ప్రజలను కోరారు.

శబరిమలకు టీఎస్ ఆర్టీసీ బస్సులు

నవతెలంగాణ - కరీంనగర్ రూరల్ : శబరిమల వెళ్లే భక్తులకు అద్దె ప్రాతిపదికన టీఎస్ఆర్టీసీ బస్సులు సమకూర్చుతోందని కరీంనగర్ రీజనల్ మేనేజర్ ఎన్. సుచరిత తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ఆర్టీసీలో 700కుపైగా కొత్త సూపర్ లగ్జరీ బస్సులను తీసుకొచ్చింది. సుశిక్షితులైన డ్రైవర్లతో భద్రమైన ప్రయాణానికి అవకాశం కల్పిస్తోంది. ఈ బస్సుల్లో టీవీ సౌకర్యం ఉంటుంది. ఇద్దరు మణికంఠ స్వాములు, ఇద్దరు వంట మనుషులు, సామాన్లు సర్దేందుకు ఒక వ్యక్తి (సీటు లేకుండా) ఉచితంగా ప్రయాణించొచ్చు. బస్సు అద్దెకు బుక్ చేసిన గురు స్వామికి ఉచిత ప్రయాణం కల్పించబడుతుంది. ఒక బస్సు కంటే ఎక్కువ బస్సులు బుక్ చేసిన గురుస్వామికి బస్సులపై రోజుకు రూ.300 చొప్పున కమీషన్ సైతం ఇస్తారు. శబరి మలకు వెళ్లే దారిలో ఇతర క్షేత్రాలకు కూడా దర్శించుకొనే వెసులుబాటు వుంది. వివరాలకు సమీప డిపో మేనేజర్లను సంప్రదించాలని సూచించారు. కావున ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అయ్యప్ప స్వామి భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్టీసీ వారి రాయితీలను అందిపుచ్చుకొని తమ ప్రయాణమును సుఖవంతము చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలతో కూడిన విద్యను అభ్యసించాలి

కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ ఎస్ఎస్‌వీఎన్.శర్మ

నవతెలంగాణ - తిమ్మాపూర్

విద్యార్థులు నైపుణ్యంతో కూడిన విద్యతోపాటు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పరిణతి చెందుతూ అంకితభావంతో చక్కని క్రమశిక్షణతో ముందుకు సాగాలని కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ ఎస్ఎస్‌వీఎన్.శర్మ విద్యార్థులకు సూచించారు. మండలంలో రామకృష్ణ కాలనీలోని వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్, కంప్యూటర్ అప్లికేషన్ ఆధ్వర్యంలో 2023 -24 విద్యా సంవత్సరానికి నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ గంధ్ర శ్రీనివాస్‌రెడ్డితో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. కళాశాలలోని మౌలిక వనరులను ఉపయోగించుకొని చక్కని నిబద్ధతలతో విద్యార్థులు ఉపాధి కల్పకులుగా రూపొందాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రెటరీ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాష్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, విభాగాధిపతులు డాక్టర్ బాపూజీ, డాక్టర్ హరిప్రసాద్‌శర్మ, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాసింపేట యువకుడు మిస్సింగ్

రేణిగుంట బ్రిడ్జి వద్ద, చెప్పులు బైకు లభ్యం

నవతెలంగాణ - గన్నేరువరం


అభిలాష్

మండలంలోని కాసింపేట గ్రామానికి చెందిన యువకుడు సందె వేని అభిలాష్ అలియాస్ మింటు(21) బుధవారం రాత్రి మిస్సింగ్ అయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి 8.30 గంటలకు బాబాయ్ సంధవేణి కొమురయ్య బైక్ తీసుకొని వెళ్లాడు. 9.30గంటలకు తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి స్టేజి వద్ద టీ తాగి అనంతరం వాట్సప్ స్టేటస్ ద్వారా తల్లిదండ్రులు నన్ను క్షమించండి అందరూ బాగుండాలని సమాచారం అందించారు. కొత్తపల్లి నుంచి నేరుగా రేణిగుంట బ్రిడ్జి వద్ద ఆగి బైకు నిలిపి, చెప్పులు విడిచి బ్రిడ్జి పైనుండి నీళ్లల్లో దూకాడని అటు నుండి వస్తున్న కోళ్ల వ్యాను డ్రైవరు పోలీసులకు సమాచారం అందించారు. తిమ్మాపూర్ మండలం, రేణిగుంట స్థానిక సర్పంచి బోయిని కొమురయ్య వెంటనే కాసింపేట సర్పంచ్ గంప మల్లీశ్వరివెంకన్నకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు గ్రామస్తులు హుటాహుటిన తరలి వెళ్లారు. బ్రిడ్జి చుట్టుపక్కల గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం రెస్క్యూటీమ్ బృందం నీటిలో గాలింపు చర్యలు చేపట్టిన ఫలితం లేదు. గురువారం ఉదయం నుంచి సాయంకాలం వరకు మరల గాలింపు చర్యలు చేపట్టారు. 24 గంటలు గడిచిన నీటిలో ఆచూకీ లభ్యం కాలేదు. కుటుంబ సభ్యులు తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఫిర్యాదు అందుకున్న ఎస్సై ప్రమోద్‌రెడ్డి శుక్రవారం ఉదయం గాలింపు చర్యలు చేపడతామని తెలిపారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు రామడుగు క్రీడాకారులు ఎంపిక

నవతెలంగాణ - రామడుగు



జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి రామడుగు మండల కేంద్రానికి చెందిన ఎ.సాయికృష్ణ, జి.రమేష్ ఎంపికైనట్లు తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యద ర్శులు వీర్ల వెంకటేశ్వరరావు, బాసరవేణి లక్ష్మణ్ తెలిపారు. వీరి ఎంపికపట్ల ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెలి మహిపాల్, జనార్దన్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసి యేషన్ వైస్ ప్రెసిడెంట్ కాసర్ల ఆనంద్ కుమార్, రమణరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, ఎస్ఎఫ్ఐ అధ్యక్షకార్యదర్శులు, కోచ్, మూల వెంకటేష్, సంఘ బాధ్యులు, పెద్దపల్లి కన్వీనర్, సురేందర్, సిరిసిల్ల కన్వీనర్ ప్రేమ్, జగిత్యాల శ్రీనివాస్, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్‌కు కుల సంఘాల మద్దతు

గర్శకుర్తిలో ఎమ్మెల్యే సతీమణి దీవెన ప్రచారం



నవతెలంగాణ - గంగాధర

గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలోని కుల సంఘాలు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సతీమణి దీవెన గ్రామంలోని కుల సంఘాల నాయకులు, సభ్యులను కలిసి మద్దతు కోరారు. దీంతో అంబేద్కర్ సంఘం, రజక సంఘం, కురుమ సంఘం, వస్త్ర, వ్యాపార సంఘం, పద్మశాలి సంఘం, కార్మిక సంఘం, ట్రాక్టర్ ఓనర్ల సంఘ సమావేశాలు ఏర్పాటు చేసుకుని బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి సుంకె దీవెన మాట్లాడుతూ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అందుబాటులో ఉంటూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని అన్నారు. సమస్యలవేటైనా పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోలోని ప్రతి పథకాన్ని అమలు చేస్తారని అన్నారు. అనంతరం పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సమావేశాల్లో కురిక్యాల సింగిల్‌విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, మాజీ జెడ్పీటీసీ గునుకొండ బాబు, సర్పంచ్ అలువాల నాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు తడిగొప్పుల రజిత, ఏఎంసీ డైరెక్టర్ మామిడిపెల్లి అఖిల్, బీఆర్ఎస్ నాయకులు అలువాల తిరుపతి, తడిగొప్పుల రమేష్, కుల సంఘాల అధ్యక్షులు దాది మోహన్, పల్ల మల్లిక్, అన్నల్‌దాస్ లక్ష్మీరాజం, అలువాల విరోభ, గడ్డం నారాయణ, రమేష్, లింగంపల్లి లక్ష్మణ్, జోసెఫ్‌పాటు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులను నాణ్యతతో చేయాలి

చొప్పదండి మున్సిపల్ కమిషనర్ పి.శాంతి కుమార్



నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండిలో రూ.33కోట్లతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులను నాణ్యతతో చేయాలని మున్సిపల్ కమిషనర్ పి.శాంతికుమార్ కాంట్రాక్టర్‌కు సూచించారు. గురువారం సెంట్రల్ లైటింగ్ పనులను ఆయన పరిశీలించారు. డివైడర్ పనులు నాణ్యతతో చేపట్టి క్యూరింగ్ ఎప్పటికప్పుడు చేయాలన్నారు. మెటీరియల్‌లో నిబంధనలకు విరుద్ధంగా తేడా ఉండకూడదని వివరించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



నవతెలంగాణ - జమ్మికుంట : ఎన్నికల కోడ్ నేపథ్యంలో జమ్మికుంట పట్టణ సీఐ బర్పాటి రమేష్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని గణేష్ నగర్ వద్ద ఎస్సై శ్రీధర్ వాహన తనిఖీలను చేపట్టారు. 50 వేల కంటే ఎక్కువ డబ్బులను సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తే సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి, మదన్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తను పరామర్శించిన మంత్రి గంగుల

నవతెలంగాణ - కొత్తపల్లి



కొత్తపల్లి మండలంలోని ఆసిఫ్ నగర్ గ్రామానికి చెందిన వెంకటేష్ అనే కార్యకర్త తల్లి దూలం రాయమల్లవ్వ అనారోగ్యంతో బాధపడుతూ రెండు రోజుల క్రితం మృతిచెందారు. మంత్రి గంగుల కమలాకర్ గురువారం వారి ఇంటికి వెళ్లి మల్లవ్వ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, ఎంపీటీసీ కమల మనోహర్, కో ఆప్షన్ సభ్యుడు సాబీర్ పాషా, సర్పంచ్ కడారి శాంతశ్రీనివాస్ ఉన్నారు.

ఎల్‌ఎండి పోలీస్ స్టేషన్‌లో సీపీ తనిఖీ

నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలోని ఎల్‌ఎండీ పోలీస్ స్టేషన్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీచేశారు. పోలీస్ స్టేషన్ లోని పలు రికార్డులను పరిశీలించారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రేణిగుంట టోల్ ప్లాజా వద్ద గల స్టాటిక్ సర్వేలెన్సు టీం ఆధ్వర్యంలోని చెక్ పోస్ట్ ను తనిఖీ చేశారు, విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాహన తనిఖీల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు, అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఏ వాహనాన్ని విడిచిపెట్టకుండా ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఆయనవెంట కరీంనగర్ రూరల్ ఏసీపీ తాంద్ర కరుణాకర్‌రావు, తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎల్‌ఎండి ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి ఉన్నారు.



చెక్ పోస్టును పరిశీలిస్తున్న సీపీ

'రైతు బంధు' డబ్బును సుంకెకు అందించిన రైతు

నామినేషన్‌కు వినియోగించాలని కోరిక..

నవతెలంగాణ - గంగాధర



ఓ రైతు తన ఖాతాలో పడిన రైతుబంధు డబ్బును చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు అందించి తన అభిమానాన్ని చాటుకున్నారు. తాను అందించే డబ్బుతో నామినేషన్ వేయాలని సుంకెను కోరుతూ రైతు చూపిన అభిమానం తీరు పార్టీ వర్గాల్లో చర్చానీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామానికి చెందిన నిమ్మ మల్లారెడ్డి అనే రైతు తెల్లవారి లేవగానే ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తలుపు తట్టారు. ఏదో సమస్యను చెప్పుకోవడానికి వచ్చి ఉంటాడని భావించిన సుంకె రైతు మల్లారెడ్డి మదిలోని మాట విని ఆశ్చర్యానికి లోనయ్యారు. తనకు ఉన్న మూడు ఎకరాలకుగాను రైతుబంధు పథకం కింద రూ.15 వేలు తన ఖాతాలో జమ అయ్యాయి. అయితే సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌పై అభిమానాన్ని పెంచుకున్న రైతు మల్లారెడ్డి తనకు వచ్చిన రైతుబంధు డబ్బు రూ.15వేలను నామినేషన్ ఖర్చుల కింద వినియోగించుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు అందించారు. రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని, ఎమ్మెల్యేగా సుంకె రవిశంకర్ మరోసారి గెలవాలని ఆకాంక్షిస్తూ రైతు మల్లారెడ్డి తనలోని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో రైతు మల్లారెడ్డికి తనపైన, సీఎం కేసీఆర్‌పైన ఉన్న అభిమానాన్ని చూసి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆలింగనం చేసుకుని అభినందించారు. రైతు మల్లారెడ్డి వెంట ఎంపీటీసీ ద్యావ మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కర్ర్భుజ తిరుపతిగౌడ్, బందారపు అజయ్ ఉన్నారు.


వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేసిన వారికే

ఓటెయ్యాలి : సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్

నవతెలంగాణ - కరీంనగర్ : మోటార్ వాహన చట్ట సవరణ, వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేసిన వారికే డ్రైవర్స్, మెకానిక్స్ ఓట్లు వేయాలని సీఐటీయూ కరీంనగర్ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయం వేస్తే చాలు రాజకీయ పార్టీలు వివిధ రకాల యూనియన్స్, అసోసియేషన్స్ వాళ్లతో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తూ తాము అధికారంలోకి వస్తే మీకు భూములు ఇస్తాం, భవనాలు కడతాం, ఐదు సంవత్సరాలు మీరు కోరిన అన్నింటికీ ఉడిగం చేస్తామని తప్పుడు వాగ్దానాలు ఇచ్చి ఓట్లు వేసుకొని రవాణా రంగ కార్మికులను అనేక ఎన్నిక సమయాల్లో మోసం చేసిన చరిత్ర మనం గమనించాలన్నారు. కరీంనగర్ జిల్లాలో రవాణా రంగ కార్మికులు డ్రైవర్లు, వివిధ మెకానిక్స్, కార్మికులందరూ డ్రైవర్లకు ఉరితాడుగా మారిన మోటార్ వాహన చట్టం 2019 సవరించి, రవాణా రంగ కార్మికులకు, మెకానికులకు భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు వలె రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేసేలా రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పెట్టి అమలు చేస్తామని వాగ్దానం ఇస్తేనే వారికి మద్దతు తెలియజేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. లేకపోతే మళ్లీ ఐదు సంవత్సరాల వరకు ప్రతి రోజు ట్రాఫిక్ ఛాలన్లు, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, ఆర్టీఏ, ట్రాఫిక్, పోలీస్ అధికారుల వేధింపులు నిత్యం ఉంటాయన్న విషయం గ్రహించాలని కోరారు. మోటార్ వాహన సవరణ చట్టం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బడ్జెట్‌లో కేటాయించి నిధుల్లో దాదాపు 30 శాతం వరకు రవాణా రంగ కార్మికుల నుంచి అక్రమంగా వసూలు చేసిన ఫైన్, టాక్సీల డబ్బులే ఉంటున్నాయి కానీ ప్రభుత్వాలు డ్రైవర్లకు గాని మెకానిక్‌లో గాని ఎలాంటి సంక్షేమ చట్టం రూపొందించలేదు అన్నారు. ఈ ఎన్నికల్లో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ చట్టం, మోటార్ వాహన సవరణ చట్టం, కార్మికుల అనుకూలమైన చట్టాలు, కనీస వేతనం, పని భద్రత వచ్చినప్పుడే సరైన న్యాయం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీల ఎన్నికల్లో మాయలో పడకుండా మన ఓటు హక్కును సరైన రీతిలో వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గంగులకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు

నవతెలంగాణ - కొత్తపల్లి



కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్‌కు మద్దతుగా పలు గ్రామాల్లో ఏకగ్రీక తీర్మానాలు చేస్తున్నారు. తాజాగా ముదిరాజ్ సంఘం నాయకులు గంగుల మద్దతుగా గ్రామ గ్రామాన ఏకగ్రీవ తీర్మానం చేశారు. అలాగే అన్ని గ్రామాల్లో ఆయా సంఘాల నాయకులు ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసుకొని గంగుల మద్దతు తెలుపుతున్నట్లు తీర్మానం చేశారు. పట్టణంలో సైతం ఇదే తరహాలో తీర్మానాలు చేయగా భగత్ నగర్ రెడ్డి సంఘం, మున్నురుకాపు సంఘం నాయకులు తీర్మానం చేశారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును 2024లోనే అమలు చేయాలి

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కొనేటి నాగమణి

నవతెలంగాణ - కరీంనగర్

మహిళా రిజర్వేషన్ బిల్లును 2024 సంవత్సరంలోనే అమలు చేయాలని ఐద్వా కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొనేటి నాగమణి అన్నారు. గురువారం ఐద్వా జిల్లా కమిటీ సమావేశం నిర్వహించగా, సమావేశానికి ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందుకూరు కృష్ణవేణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి మాట్లాడుతూ.. సమాజంలో సగ భాగంలో ఉన్న మహిళలకి 50శాతం సీట్లు కేటాయించాలని, 33శాతం రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతుందని అన్నారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అని అన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు కావాలనుకున్నప్పుడు మహిళలు కనబడుతున్నారు కానీ ఆ తర్వాత మహిళలను పట్టించుకోకుండా విఫలమవుతున్నారని అన్నారు. ఈ జిల్లా కమిటీ సమావేశంలో ఉపాధ్యక్షురాలు ద్యావా అన్నపూర్ణ, సహాయ కార్యదర్శి నరాల లావణ్య, జిల్లా కమిటీ సభ్యులు రజిత, సరూప, రోజా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కొనేటి నాగమణి

డీవైఎఫ్ఐది అలుపెరగని పోరాటం

జిల్లా కార్యదర్శి జి.తిరుపతి

నవతెలంగాణ - కరీంనగర్



దేశంలో 43 ఏండ్ల యువజనోద్యమంలో డీవైఎఫ్ఐ అలుపెరగని పోరాటం చేసిందని, నిరుద్యోగుల, యువత సమస్యలపై అమరవీరుల పోరాట స్ఫూర్తితో పోరాడుతాం అన్ని కరీంనగర్ జిల్లాలో ఘనంగా డీవైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీ.తిరుపతి తెలిపారు. గురువారం కరీంనగర్ మంకమ్మతోటలోని జిల్లా కార్యాలయం ఎదుట తిరుపతి జండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరీంనగర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేష్ పటేల్, జి.తిరుపతి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అనేక సమరశీల పోరాటాలు చేసి దేశంలోనే అతిపెద్ద యువజన సంఘంగా నిలిచిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్, ప్రేమ్, విజయ్, రాజేందర్, క్రాంతి, రాజు, మహమ్మద్ రియాజ్, తిరుపతి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ జాతీయ శిబిరంలో పారమిత విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ - కరీంనగర్



హైదరాబాద్‌లో అక్టోబర్ 23 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు డైరక్టర్ జనరల్ ఆఫ్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి 'ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్' క్యాంపులో స్థానిక మంకమ్మతోటలోని పారమిత పాఠశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతిభ చూపారని ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్ విభాగం నుంచి పారమిత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పారమిత ఎన్‌సీసీ క్యాడెట్లు పింగిలి విజికా రెడ్డి (కూచిపూడి నాట్యం), బూడిద రేవంత్ కౌశిక్ (ఎన్ఐఏపీ-సంస్కృతి), గౌడ హృదయ్ (వాయిద్యం), గజ్జెల అశ్విత్ (ఎన్ఐఏపీ- సంస్కృతి), అడ్ల హన్సిత్(ఎన్ఐఏపీ- సంస్కృతి) లు పాల్గొని అత్యద్భుత ప్రదర్శన కనబరిచిన పారమిత పాఠశాల ఎన్‌సీసీ క్యాడెట్లను 9 తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ కమాడింగ్ ఆఫీసర్ డానియల్ లాట్జమ్ అభినందించారు. ఎన్‌సీసీ క్యాడెట్లను పారమిత పాఠశాలల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, హనుమంత రావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత, ఏఎస్ఓడీ తిరుపతి రావు, ఎన్‌సీసీ అధికారి రాం సాయి, ఎక్స్ సర్వీస్‌మెన్ రమేష్, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా

ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి

నవతెలంగాణ - జమ్మికుంట



హుజురాబాద్ నియోజకవర్గం నుండి ఏడుసార్లు ఈటల రాజేందర్‌ను గెలిపించారని.. ఈసారి తనకు ఓటు వేసి ఒక్కసారి అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం జమ్మికుంట మండలంలోని జగ్గయ్యపల్లి, మాచనపల్లి, పెద్దంపల్లి గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద సభ జడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించగా పాడి కౌశిక్ రెడ్డి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, ఎంపీపీ మమత, సర్పంచులు కనపర్తి వంశీధర్‌రావు, అన్నపూర్ణ, బొజ్జం కల్పనాతిరుపతిరెడ్డి, ఎంపీటీసీ పోలసాని రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యచరణ రూపొందించుకోవాలి

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి



నవతెలంగాణ - కరీంనగర్

వచ్చే సంవత్సరం నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించేందుకు ముందస్తుగా కార్యచరణ రూపొందించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి అన్నారు. గురువారం కరీంనగర్ రెస్ట్ హౌస్‌లో వచ్చే సంవత్సరం నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్, ఆర్డీఓ లతో కలసి సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డీఓ కే.మహేశ్వర్, రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం

తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ తెలంగాణ, హైదరాబాద్ ఆదేశాల మేరకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసినట్టు˝రీంనగర్ జిల్లా మద్య నిషేధ, అబ్కారీ అధికారి తెలిపారు. అక్రమ గోదాములు డంప్‌లు, మద్యం అక్రమాలకు సంబంధించిన ఇతర అన్ని అంశాలను నివేదించడానికి, మద్యం యొక్క వాస్తవికతను ధృవీకరించడానికి ఉపయోగించే వెరిట్ యాప్‌ని ఉపయోగించుకోవాలని అన్నారు. కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ తెలంగాణ, హైదరాబాద్ టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-2523, కరీంనగర్ జిల్లా కంట్రోల్ రూం నెంబర్ 8019263862కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

జమ్మికుంటలో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట కాటన్ మార్కెట్ యార్డ్‌లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని, పాత గ్రేన్ మార్కెట్ యార్డ్‌లో పిఎసిఎస్ వారి ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కరీంనగర్ జిల్లా మార్కెటింగ్ అధికారి పద్మావతి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి గుగులోత్ నాయక్, సీసీఐ సెంటర్ ఇన్‌చార్జి, పిఎసిఎస్ సీఈవో వొజ్జ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
5
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం | నవంబర్ 03, 2023 | www.navatelangana.com

ఎన్నికల నామినేషన్లకు పటిష్ట బందోబస్తు

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:
అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ పక్రియకు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని నామినేషన్ కేంద్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆనంద్ కుమార్, అదనపు ఎస్పీ చంద్రయ్య, పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేటి నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ ఎన్నికల నామినేషన్లకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్, కేంద్ర బలగాలతో పటిష్ట భద్రత, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్‌ల దాఖలుకు అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని, ఐదుగురు కంటే ఎక్కువ మందికి లోపలికి పర్మిషన్ లేదన్నారు. నామినేషన్ కేంద్రం నుంచి 100 మీటర్ల దూరం వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.


అధికారులకు సూచనలు అందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరం నుంచి కేవలం మూడు వాహనాలనే అనుమతిస్తామని చెప్పారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. ఎస్పీ వెంట సిరిసిల్ల డిఎస్పీ ఉదయ్ రెడ్డి, టౌన్ సిఐ ఉపేందర్, ఎమ్మార్వో షరీఫ్ మోహినుద్దీన్ లు ఉన్నారు.

సిరిసిల్లలో గంజాయి కాల్చివేత

- 32.754 కేజీల గంజాయికి నిప్పు పెట్టిన పోలీసులు

నవతెలంగాణ-సిరిసిల్లరూరల్


గంజాయిని కాల్చివేస్తున్న పోలీసులు

డిస్ట్రిక్ట్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల లోని రగుడు వద్ద గల డంప్ యాడ్‌లో వివిధ పోలీస్‌స్టేషన్లో నమోదైన 41 కేసులలో స్వాదీన పరచుకున్న 32 కిలోల 754 గ్రాముల గంజాయిని జిల్లా పోలీసులు కాల్చి బూడిద చేశారు. నిషేధిత గంజాయిని శాస్త్రీయ పద్ధతిలో తగులబెట్టే ప్రక్రియలో డిస్ట్రిక్ట్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, సభ్యులు అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజాన్ని పీడిస్తున్న అతి పెద్ద సమస్య గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత బాని సలుగా మారి, తమ అమూల్యమైన భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎస్పీ వెంట అదనపు చంద్రయ్య, డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, ఆర్ఐ యాదగిరి, టౌన్ సీఐ ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

యువ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా యూత్ ఇన్‌చార్జి జక్కుల నాగరాజు

నవతెలంగాణ-సిరిసిల్లరూరల్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్ల నియోజకవర్గ వ్యాప్తంగా వీర్లపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగలపల్లి ఐదు మండలాలలో నిర్వహించే యువ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా యూత్ ఇన్‌చార్జి జక్కుల నాగరాజు పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం యువజన నాయకులతో జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఒక్కొక్క సభలో ప్రతి గ్రామానికి వందమంది చొప్పున పదివేల మంది పాల్గొనాలన్నారు. సిరిసిల్ల అభివృద్ధి చెంది ముఖచిత్రం ఎలా మారిందని, ఈసభ ద్వారా ప్రజలకు వివరిస్తామన్నారు. సిరిసిల్ల మరింత అభివృద్ధి చెందాలంటే కేటీఆర్‌ను లక్ష మెజారిటీతో గెలిపించి, యూత్ మొత్తం ఒక్కతాటిపై ఉన్నామని నిరూపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకులు గడ్డమీది శ్రీకాంత రెడ్డి, వెంగని మనోహర్, కొత్త సంతోష్‌గౌడ్, షేక్ సికిందర్, సింగారం దేవరాజు, సయ్యద్ అప్రోచ్, శీలం స్వామి, చరణ్, పురుషోత్తం, సాయికిరణ్, కాసర్ల పవన్, సిలువేరి ఆంటోనీ పాల్గొన్నారు.

దళిత సంక్షేమానికి కృషి చేస్తా

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ

నవతెలంగాణ-చందుర్తి:


మాట్లాడుతున్న చల్మెడ

దళిత సంక్షేమం కోసం కృషి చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో పెరుక కల్యాణ మండపంలో నిర్వహించిన దళిత ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. వేములవాడ ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే మండల కేంద్రంలో దళిత భవన నిర్మాణం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు తదితరులు ఉన్నారు.

యువ ఆత్మీయ సమ్మేళన స్థలం పరిశీలన

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట


సభ స్థలాన్ని పరిశీలిస్తున్న తోట ఆగయ్య

మండల కేంద్రంలో ఈనెల 6వ తేదిన పెద్ద ఎత్తున నిర్వహించ తలపెట్టిన యువ ఆత్మీయ సమ్మేళన సభ కోసం గాయిత్రీ డిగ్రీ కళాశాల వెనుక గల ఖాళీ స్థలాన్ని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యలు గురువారం పరిశీలించారు. వారి వెంట ఎల్లారెడ్డిపేట ఎంపీపీ పిల్లి రేణుక, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు అందె సుభాష్, గుళ్ళపెల్లి నర్సింహారెడ్డి, నాయకులు హసన్, కిషన్, యూత్ లీడర్లు గన్నమనేని సుధాకర్‌రావు, బంటీగౌడ్, ప్రమోద్ పాల్గొన్నారు.

కారు జోరు.. ఏనుగు ప్రచారం..

నవతెలంగాణ-వేములవాడ:


బీఆర్ఎస్ పథకాలను వివరిస్తున్న మనోహర్‌రెడ్డి

వేములాడలో విలీన గ్రామమైన సత్రాజ్‌పల్లిలో మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావును గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శాత్రాజు పల్లె, చుట్టుపక్క గ్రామాలలో గడప గడపకు గులాబీ జెండా ప్రచార కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ మెనిఫెస్టో గురించి ప్రతి ఓటరుకు వివరిస్తూ, ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, కారు గుర్తుపై ఓటు వేసి "చల్మెడ" ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. సంక్షేమ ఫలాలు అందాలంటే కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని రాష్ట్రంలో మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్‌రెడ్డి, గుడిసె మనోజ్‌కుమార్, మ్యాకల శ్రీనివాస్, మొగ్గ అనిల్‌కుమార్, కొప్పెర సంతోష్‌రెడ్డి, అన్నాడి జనార్దన్‌రెడ్డి, ఐత వెంకటేశం, గుడిసె నరేష్, సిరిసిల్ల శంకర్, సుద్దాల వీరేందర్, చందనం వెంకటేష్, విక్కుర్తి సాయి గౌడ్, పురుషోత్తం, దాసు, సూర ఎల్లయ్య, మిట్టపెల్లి రాజు, గడ్డం మధు, శివకృష్ణ, మొగిలి రమేష్, ప్రకాష్, చిగుర్ల రాజు, చిగుర్ల మహేష్, గుంటి ప్రశాంత్, జిల్లా మధు తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తా..

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ

నవతెలంగాణ-వేములవాడ:


న్యాయవాదులతో మాట్లాడుతున్న చల్మెడ ఆనందరావు

ఒక్క అవకాశం ఇస్తే, న్యాయవాదుల సమస్యలు తెలిసిన వాడిగా రాబోయే రోజుల్లో వేములవాడ కోర్టులో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చల్మెడ లక్ష్మీకాంతారావు అన్నారు. తన తండ్రి స్వయానా న్యాయవాది కావడంతో పాటు న్యాయ శాఖ మంత్రిగా సేవలు అందించడంతో న్యాయవాద కుటుంబం నుంచి వచ్చిన తనకు న్యాయవాదులంటే ఎనలేని గౌరవం ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు అన్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోయినిపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి గురువారం వేములవాడ పట్టణంలోని బార్ అసోసియేషన్ వద్ద అసోసియేషన్ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ సమాజంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన న్యాయవాద వృత్తి వల్లనే తమ కుటుంబం ఈనాడు ఇంతటి స్థాయికి ఎదిగిందని అన్నారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు, కార్యదర్శి నక్క దివాకర్, ఉపాధ్యక్షుడు గడ్డం సత్యనారా యణరెడ్డి, సీనియర్ న్యాయవాదులు రేగుల దేవేందర్, పురుషోత్తం, చెర్ల ఆనంద్ కుమార్, నర్సింగరావు, అనిల్ కుమార్, సుధాకర్‌రెడ్డి, సుజీవన్, కిషోర్ రావు, బొడ్డు ప్రశాంత్, రజనీకాంత్, నాగుల సంపత్ గౌడ్, అన్నపూర్ణ,నాయీమా నాసారి తదితరులు పాల్గొన్నారు.

ఫోక్సో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:



రాజన్న సిరిసిల్ల జిల్లా ఫోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పెంట శ్రీనివాస్ నియామకమయ్యారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఒకటో అడిషనల్ సెషన్స్ జిల్లా కోర్టు పీపీగా అనిల్ కుమార్ సీనియర్ సివిల్ కోర్టు ఏజీపీగా గంట అంజయ్యలు నియామకమయ్యారు. వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లి గ్రామానికి చెందిన పెంట శ్రీనివాస్ బీకాం ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసి 2007లో బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్రోల్ చేసుకున్నారు. పది సంవత్సరాలుగా సిరిసిల్లలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఇదే క్రమంలో ఇటీవల లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అసిస్టెంట్ చీఫ్‌గా నియామకమయ్యారు. ఇందులో కొనసాగుతుండగానే నియామకం కావడంతో ఆ పోస్ట్‌కు రాజీనామా చేసి పీపీగా బాధ్యతలు స్వీకరించారు. పెంట శ్రీనివాస్ తెలంగాణ సాధనలో భాగంగా 2009 నుంచి 2014 వరకు ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యమాలు చేసి జైలుకు వెళ్లాడు. అదే విధంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. మూడుసార్లు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అదేవిధంగా తంగళ్ళపల్లి మండలంలోని బద్దెనపల్లికి చెందిన అనిల్ కుమార్ బీఎస్సీ ఎల్‌ఎల్‌బీ పూర్తిచేసి 2006లో బార్ కౌన్సిల్లో ఎన్రోల్మెంట్ చేసి సిరిసిల్లలో 17 సంవత్సరాలుగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తుండ గా ఒకటో అడిషనల్ సెషన్స్ జిల్లా కోర్టు పీపీగా నియామకమయ్యారు. ముస్తాబాద్ మండలంలోని కొండాపూర్‌కు చెందిన గంట అంజయ్య బీఏ ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసి 2003లో బార్ కౌన్సిల్లో రెండు రోజులు చేసుకొని సిరిసిల్లలో 20 ఏళ్లుగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తుండగా సీనియర్ సివిల్ కోర్టు ఏజీపీగా ఆయన నియామకమయ్యారు. బార్ కౌన్సిల్లో న్యాయవాదులు వారిని అభినందించారు.

డాక్టరేట్ అందుకున్న రాచర్ల గొల్లపల్లి ముద్దుబిడ్డ

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట


పట్టా అందుకుంటున్న కిష్టయ్య

మండల కేంద్రంలో రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన అందె కిష్టయ్యకు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా గురువారం అందుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో సాహిత్య సాంస్కృతిక సంస్థల పాత్ర ఒక పరిశీలన 1963-2010 అనే అంశంపై ఓయూ ప్రొఫెసర్ ఎస్ఆర్ వెంకటేశం పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను అందె కిష్టయ్యకు డాక్టరేట్ ప్రకటించింది. ఈ డాక్టరేట్ పట్టాను ఉస్మానియా యూనివర్సిటీ 83వ స్థానాకోత్సవ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రగవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్, అడోబ్ సీఈవో శాంతను నారాయణ చేతులమీదుగా పీహెచ్‌డీ డాక్టరేట్ అందె కిష్టయ్య అందుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన దళిత వ్యవసాయ కుటుంబంలో అందె పోచయ్య-పోశవ్వ దంపతుల కుమారుడు రాచర్ల గొల్లపల్లిలోని హై స్కూల్‌లో పదోతరగతి వరకు పూర్తి చేసి ఇంటర్ సిరిసిల్ల జూనియర్ కళాశాలలో పూర్తి చేశాడు. డిగ్రీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలో పూర్తి చేసి ఆ తర్వాత ఎంఎ తెలుగుతో పాటు బీఈడీ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. 2014లో సేట్ క్వాలిఫై అయ్యాక ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ప్రారంభిస్తున్న నాయకులు

నవతెలంగాణ-వీర్నపల్లి
వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించి మద్దతు ధర పొందాలని సర్పంచ్ లత మల్లేశం తెలిపారు. సీసీ శ్యామల, మహిళ సంఘం వీవో అధ్యక్షురాలు జీనుక పద్మ, ఏఎంసీ డైరెక్టర్ సత్యం ఉన్నారు.

అవినీతిపరులకు శిక్షతప్పదు

యూత్ కాంగ్రెస్ మండల్ వైస్ ప్రెసిడెంట్ అఖిల్

నవతెలంగాణ ఇబ్రహీంపట్నం


అఖిల్

ఎంతటివారైనా అవినీతి పరులకు శిక్ష తప్పదని యూత్ కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్ అఖిల్ అన్నారు.అత్యంత అవినీతి పరుడైన కేసీఆర్‌కు శిక్ష తప్పదని అన్నారు. రైతులకు న్యాయం జరగాలి, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలి అంటే ఇందిరమ్మ రాజ్జం రావాలి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన ఆరు గ్యారంటీ స్కీంలను తప్పకుండా అమలు చేస్తునందని తెలిపారు.

కరాటే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

హై స్కూల్ హెచ్ఎం రాజన్న

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం:


శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

కరాటే శిక్షణ తరగతులను ప్రభుత్వ పాఠశాలలలో ప్రభు త్వం నవంబర్ 1 నుంచి జనవరి 31 వరకు అందించే మూడు నెలల కరాటే శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హైస్కూల్ హెచ్ఎం రాజన్న సూచించారు. ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో హైస్కూల్ హెచ్ఎం రాజన్న కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు. అనంతరం హెచ్ఎం మూడు నెలల పాటు అందించే కరాటే శిక్షణను కరాటే మాస్టర్ పసునూరి అవినాష్ విద్యార్థులకు ఇవ్వనున్నారని తెలిపారు.

కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

నవ తెలంగాణ-జగిత్యాల టౌన్



జగిత్యాల పట్టణ పద్మనాయక కళ్యా ణ మంటపంలో జగిత్యాల పట్టణ బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయ కులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో జగి త్యాల ఎన్నికల ఇన్‌చార్జీ ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జెడ్పీ చైర్మన్ దావ వసంత-సురేష్, మాజీ మంత్రి ఎన్నికల ఇన్‌చార్జీ రాజేశం గౌడ్ పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ ఛైర్మెన్ డా చంద్రశేఖర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు గట్టు సతీష్, మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, అర్‌టీఏ జిల్లా మెంబర్ సుధాకర్ రావులు పాల్గొన్నారు.

గణితంలో పీహెచ్‌డీ పొందిన జగిత్యాల వాసి

నవ తెలంగాణ-జగిత్యాల టౌన్



ఉస్మానియా యూని వర్సిటీలో విద్యాన భ్యసి స్తున్న జగిత్యాలకు చెందిన గంగిపెల్లి చంద్రశేఖర్ గణితంలో పీ హెచ్‌డీపట్టాన పొందారు. గణితంలో ఫ్లూయిడ్ డైనమిక్ ఏరియా అనే సబ్జెక్టులో "స్టెబిలిటీ అనాలసిస్ ఆఫ్ సర్క్యూలర్ రిలేజ్ ప్రాబ్లమ్స్" పై తీసిస్ సమర్పించి తన గైడ్ డా. వెంకటలక్ష్మీకి అందించి పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ఇటీవలే ఉస్మానియాలో జరిగిన 83వ స్నాతకోత్సవం లో హైద్రాబాద్ ఆడోబ్ సీఈవో సంతన్ నారాయణ్, వీసీ గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా గంగిపెల్లి జగదీశ్వర్, పృథ్వీరాజ్, శంకర్, దినేష్, వినోద్, రాకేష్, సాయినాథ్, సాయికృష్ణ, రాజేష్, రమేష్, వేణుమాధవ్, సుధాకర్‌లు అభినందనలు తెలిపారు.

బీఆర్ఎస్ విస్తృత ప్రచారం

నవతెలంగాణ-మేడిపల్లి



మేడిపల్లి మండల కేంద్రంలో వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ చల్మెడ లక్ష్మీనరసింహా రావుకి మద్దతుగా మేడిపల్లి ఎంపీ టీసీ మకిలి దాసు ఆధ్వర్యంలో గడపగడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దాసు, మేడపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు దేశవేణి కృష్ణ, తోపారపు అర్జున్, కర్ణాకర్, మకిలి సురేష్ పాల్గొన్నారు.

ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తామని కేసీఆర్ హామీ ఇవ్వాలి

ముత్యంపేట చెరుకు ఉత్పత్తిదారుల రైతు సంఘం అధ్యక్షుడు నారాయణరెడ్డి


మాట్లాడుతున్న చెరుకు రైతులు

నవతెలంగాణ ఇబ్రహీంపట్నం:

ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తామని ఇక్కడి ప్రాంత చెరుకు రైతులకు ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చిన తర్వాతే శుక్రవారం కోరుట్లలో జరిగే బహిరంగ సభకు రావాలని ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో మామిడి నారాయణరెడ్డి గురువారం చెరుకు రైతులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలలో చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తామని హామీ ఇచ్చి అసెంబ్లీ ఎన్నికలలో గెలిచి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూతపడిన చక్కెర ఫ్యాక్టరీని తెరిపించడం మాటే మర్చిపోయారని అన్నారు. ఈ సమావేశంలో రైతు నాయకులు గురిజెల రాజారెడ్డి, బద్దం శ్రీనివాసరెడ్డి, చెరకు రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఎలిసె పాపన్న, రైతులు తీగల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

నవ తెలంగాణ-జగిత్యాల టౌన్



జగిత్యాల పట్టణంలోని నర్సింగాపూర్ గ్రామ శివారులో సర్వేనెంబర్ 437/112/2 లోని సుమారు 200 ఎకరాలపైన ప్రభుత్వ భూమిలో 19 రోజులుగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల పోరాటం కొనసాగుతుంది. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాని వాళ్లకి ప్రభుత్వ అధికారులు ఇండ్ల స్థలాలను కల్పించాలని సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ జి తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు. గుడిసె పోరాటంలో పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పేదలతో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (ఏ) ప్రకారం పేదలకు బతికే హక్కు ఉందని వారికి ఇండ్లు ఉండాలని ఈ మధ్యకాలంలో ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. రాజ్యాంగంలోని 32.2 అధికరణం సమాజంలో అసమానతలు ఉండకూడదని కనీస హక్కులు ప్రతి ఒక్కరికి కల్పించాలని చెపుతుందని అన్నారు. దాని స్ఫూర్తితోనే నిలువ నీడలేని పేదల కోసం ఈ భూ పోరాటాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండ్ల స్థలాల పోరాట కన్వీనర్ గర్వాంధుల రమేష్, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వెలుగొండ పద్మ సీఐటీయూ జిల్లా నాయకులు రఫీ, విజయ్, సాదుల్లా రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ చంద్రయ్య ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు వినోద్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై గడపగడపకు ప్రచారం

▸ లక్ష్మణ్ కుమార్‌ను గెలిపించాలి ▸ మాజీ జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ కటారి చంద్రశేఖరరావు

నవతెలంగాణ -పెగడపల్లి:


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెగడపల్లి మండల పరిధిలోని లింగాపూర్, బతికే పెల్లి గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను మాజీ జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ కటారి చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో గడప గడప ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, సర్పంచ్‌లు ఈరెల్లి శంకర్, తాటిపర్తి శోభారాణి,ఎంపీటీసీ పూసాల శోభ తిరుపతి, కడారి తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఒరుగుల శ్రీనివాస్,ఉపాధ్యక్షులు సంధి మల్లారెడ్డి, తడగొండ రాజు,ప్రధానకార్యదర్శులు చాట్ల భాస్కర్, గోగూరి సతీష్ రెడ్డిలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

నవ తెలంగాణ-కథలాపూర్


అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కథలాపూర్ మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికై నందుకు ప్రిన్సిపాల్ నరేష్ అభినందిం చారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లా డుతూ మహబూబ్ నగర్ లో జరిగిన రాష్ట్రస్థాయిలో వాలీబాల్ బండి ఉదయ్ కిరణ్, కోకోలో నూతన్ కుమార్ రాష్ట్ర స్థాయిలో ఆడినందుకు సన్మానం, మెమో ప్రజెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీ రవీందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ -కొడిమ్యాల

కొడిమ్యాలలో వివిధ పార్టీలకు చెందిన 50 మంది నాయకులు గురువారం బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.మండల అధ్యక్షుడు పులి వెంకటేష్,ప్యాక్స్ ఛైర్మన్ మేనేని రాజనర్సింగరావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు సింగిరెడ్డి వసంత-తిరుపతిరెడ్డి, కొత్తూరి స్వామి, అంబటి తిరుమలేష్, మొగిలి పాలెం రమేష్,లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విస్తృత ప్రచారం

నవ తెలంగాణ-మేడిపల్లి


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

మేడిపల్లి మండలంలో వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల అమలు హామీ గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మార్గం నర్సిరెడ్డి, చేపూరి నాగరాజు, దోమల ప్రవీణ్ ,మేకల రాజు, మెట్టు రాకేష్ పాల్గొన్నారు.

కుల సంఘాలు ఏకగ్రీవ తీర్మానం

నవ తెలంగాణ-కథలాపూర్



కథలాపూర్ మండలంలోని దుంపేట భూషణ్‌రావుపేట పద్మశాలీ, ముదిరాజ్ మాదిగ కుల సంఘాలు ఏకగ్రీవంగా బీఆర్ఎస్ పార్టీకి కారు గుర్తుకు ఓటేసి గెలిపిస్తామని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ లోక బాపురెడ్డి సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులను చూసి కుల సంఘాలు ఏకగ్రీవంగా తీర్మానం చేసినవి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో .జడ్పీటీసీ నా భూమయ్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గంగాధర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ చేరిన యువత

నవ తెలంగాణ-మేడిపల్లి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న చల్మెడ

మేడిపల్లి మండలం మాచాపూర్ గ్రామా నికి చెందిన యా దవ సంఘం సభ్యులు బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు .ఆయన గెలుపు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాచాపూర్ గ్రామ సర్పంచ్ బాలరాజు, వెంకటరావుపేట మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్ కుమార్, ఎండీ రఫీ, యాదవ సంఘ పెద్ద మనుషు లు, మహిళలు ,తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు


పార్టీలో చేరిన మహిళలు

నవతెలంగాణ -ఎండపల్లి : మండలంలోని చెర్లపల్లి,కోడి పుంజుల పల్లి గ్రామాలకు చెందిన సుమారు 100 మందికి పైగా గ్రామస్తులు, గురువారం జగిత్యాల జిల్లా డీసీసీ అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు..ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గుండేటి జితేందర్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, మద్దుల గోపాల్ రెడ్డి,ధర్మపురి మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొగిలి, వెల్గటూర్ మండల కాంగ్రెస్, యూత్ అధ్యక్షుడు రమేష్,సర్పంచ్ మురళి, ఉప సర్పంచ్ సందీప్,ఎంపీటీసీ జాడి సుజాత రాజేశంలు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన కార్యకర్తలు

నవతెలంగాణ -ఎండపల్లి


సీఎం సభకు వెళ్తున్న కార్యకర్తలు

ధర్మపురిలో జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీ ర్వాద యాత్రకు జై బీఆర్ఎస్.. జయహో కొప్పుల ఈశ్వర్ అంటూ కార్యకర్తలు బహిరంగ సభకు తరలివెళ్లారు. మండలంలోని రాజా రాంపల్లి గ్రామం నుంచి సంఘ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో యాత్రకు మహిళలు యువకు లు భారీగా తరలివెళ్లారు. ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయడం కోసం ఎండపల్లి మండల అధ్యక్షుడు సింహా చలం జగన్ భారీగా జనాన్ని ధర్మపురికి తరలించారు.

జిల్లాకు చేరుకున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

నవ తెలంగాణ-జగిత్యాల టౌన్

రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా జగిత్యాల జిల్లాకు కేటాయించబడిన ఎన్నికల వ్యయ పరిశీలకులు సంతోష్ కుమార్ జిల్లా కేంద్రానికి గురువారం సాయంత్రం చేరుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, దివాకర, ఆర్డీవో నరసిం హమూర్తిలు పరిశీలకులకు మొక్కలను అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు శ్రీధర్, నరేష్, సుజాతలు ఉన్నారు.

నేడు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

నవతెలంగాణ-ఓదెల: ఓదెల మండలంలోని గోపరపల్లి, కొలనూరు, హరిపురం, నా సానిపల్లి, అప్పడిపల్లి, ఓదెల, భీమరపల్లి, జిలకుంట, బ్రాహ్మణ పల్లి, ఇందుర్తి, పొత్కపల్లి, మడక, కనగర్తి గ్రామాల్లో నేడు ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభి స్తున్నట్లు ఏపీఎం ఒక ప్రకటనలో తెలిపారు.

పెద్దపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

గుండేటి ఐలయ్య యాదవ్



కాంగ్రెస్ లో చేరడానికి వెళ్లిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్

నవతెలంగాణ-ఓదెల: ఓదెల మండలం నుంచి తెలంగాణ ఉద్యమకారులు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున తరలి వెళ్లారు.ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ ఓదెల మండలం 120 మంది తెలంగాణ ఉద్యమకారులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.ఉధ్యమకారులను కేసీఆర్ పట్టించుకోవడం లేదని అవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు రానున్న విలువెంటో ఎన్నికల్లో చూపిస్తామని అగ్రహ వ్యక్తం చేశారు. స్థానిక శాసనసభ్యుడు మనోహర్ రెడ్డి ఉద్యమకారులను అడుగు అడుగునా అణగతొక్కుతున్నాడని అన్నారు.

ఓసీపీ-3 కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

టీబీజీకెఎస్ వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్



కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న ఐలి శ్రీనివాస్

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ: ఓసీపీ-3 కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అర్జీ-2 ఉపాధ్యక్షుడు ఆయిలి శ్రీనివాస్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఓసీపీ కృషిభవన్ సందర్శించిన సందర్భంగా కార్మికులు పలు సమస్యలను ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఓసీపీ-3 100 డంపర్ పార్కింగ్ యార్డులో నీటి సదుపాయం కల్పించాలని కల్పించాలని అన్నారు.ఈ సందర్భంగా ఐలి శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్యలు అన్నింటిని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఓసిపి-3 ప్రాజెక్ట్ కార్యదర్శి కొంగర రవీందర్, ఆకుల రాజయ్య, గజ్జి ఓదెలు ,ఎలకపల్లి సదయ్య, అబ్బు శ్రీనివాసరెడ్డి, కొండయ్య, కర్క శ్రీనివాస్, బాలయ్య, పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

నవతెలంగాణ- ముత్తారం : ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో గురువారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక మేట వేసిన పొలాల్లో ఆయిల్‌ఫామ్ పంట వేయడం వల్ల ఇసుక మేట తీసే ఖర్చు తగ్గుతుందని అన్నారు. ఆయిల్ పామ్ వరదలకు, వడగండ్లు తట్టుకుని నిలబడి ఉంటుందని అన్నారు. 6 సంవత్సరాల తర్వాత ఎకరానికి లక్ష రూపాయల ఆదాయం వస్తుందని తెలిపారు.ఈ సదస్సులో మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్, సర్పంచ్ సిరికొండ బక్కారావు, ఎంపీటీసీ కిషన్ రెడ్డి, ఉద్యానవన అధికారి శ్రీకాంత్, ఎఈవో శ్రీలేఖ, సాగర్, కన్వీనర్లు రాజిరెడ్డి, పాపారావులు పాల్గొన్నారు.

బీఎస్పీలో చేరిన పెద్దపల్లి జెడ్పీటీసి



పార్టీలో చేరిన నాయకులు

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్ : బహుజన్ సమాజ్ పార్టీ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష ఆధ్వర్యంలో గురువారం బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రామ్మూర్తి(బీఆర్ఎస్), కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పెద్దపల్లి మాజీ జడ్పీటీసీ ఈర్ల కొమురయ్య, పెద్దపల్లి కౌన్సిలర్ పోతాని పురుషోత్తం (బీఆర్ఎస్), సుల్తానాబాద్ జడ్పీటీసీగా పోటీ చేసిన ఆరేపల్లి మధు, జూలపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ ఒగ్గు మల్లేశం, వడకాపూర్ గ్రామ 1వ వార్డ్ మెంబర్ జెట్టి కుమార్, ర్యాకల్ దేవ్‌పల్లి గ్రామ ఒకటవ వార్డు గరికాటి లక్ష్మీ రెండో వార్డు పూసల శంకరమ్మ, జూలపల్లి గ్రామ 6వ వార్డు నెంబర్ ఒప్పనపల్లి లక్ష్మీ వివిధ గ్రామాల వార్డు మెంబర్లు, మాజీ వార్డ్ మెంబర్లు, పలువురు నేతలకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణాల పార్టీల దోపిడీ జెండాలు మోయలేక, రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది బీఎస్పీని ఆదరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దాసరి హనుమయ్య, బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష, అసెంబ్లీ మహిళ కో కన్వీనర్ దేశబోయిన అఖిల, సుల్తానాబాద్ మండల కోశాధికారి అల్లేపు చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

ఎఐసీసీ పరిశీలకుడు, మహారాష్ట్ర రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ సుదీప్ చాకోటే



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్ : పెద్దపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని,సర్వేలన్నీ కాంగ్రెస్ వైపే ఉన్నాయని ఏఐసీసీ పరిశీలకుడు, మహారాష్ట్ర రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ సుదీప్ చాకోటే అన్నారు.గురువారం పట్టణంలోని ఆర్ ఆర్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన పెద్దపల్లి నియోజకవర్గ ముఖ్య నాయకుల, బూత్, గ్రామ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ అధికారంలో లేకున్నా ఎన్నో యేండ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలు రాబోయే రోజుల్లో రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతకుంట విజయరమణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో, నియోజకవర్గం లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే చేస్తున్న అవినీతికి చరమగీతం పాడాలని, ప్రతి పథకాలలో అవినీతి అడ్డగోలుగా చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు.

సోడాల వర్తక సంఘంతో మాజీ ఎమ్మెల్యే ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్: గోదావరిఖని స్థానిక మేదరబస్తీలోని శ్రీనివాసహాల్‌లో సోడాల వర్తక సంఘం సభ్యులు మాజీ ఎమ్మెల్యే, రామగుండం స్వతంత్ర అభ్యర్థి సోమారపు సత్యనారాయణతో గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సారి మాజీ ఎమ్మెల్యే, రామగుండం స్వతంత్ర అభ్యర్థి సోమారపు సత్యనారాయణకు మద్దతుగా సోడాల వర్తక సంఘం సభ్యులు, వారి కుటుంబ సభ్యులు 500 మంది పూర్తి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బైరి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి దాసరి శ్రీనివాస్, తాటిపాముల బిక్షపతి, ఆడెపు రాజేందర్, గోనేఆశాలు, రాజేందర్, పద్మశాలి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి బుర్ల దామోదర్, మాజీ అధ్యక్షుడు మంచికట్ల బిక్షపతి, పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసుపై ఏసీపీ విచారణ



వివరాలు తెలుసుకుంటున ఏసీపీ తుల శ్రీనివాస రావు

నవతెలంగాణ- యైటింక్లయిన్ కాలనీ: తనను కులం పేరుతో,అసభ్య పదజాలంతో దూషించి, అవమానించారని జీడీకే టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదుపై గురువారం గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస రావు వెంకట్రావ్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గత నెల అక్టోబర్ 19న జరిగిన సంఘటనలో వెంకట్రావుపల్లి మాజీ సర్పంచ్ బుర్ర ముత్యాలు గౌడ్ అదే గ్రామానికి చెందిన కండె లక్ష్మయ్యను కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేయడంతో వారిపై జీడీకే టూటౌన్ సీఐ సూరం వేణుగోపాల్ అక్టోబర్ 20న ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కేసు వివరాలను పరిశీలిస్తూ ఈ కేసులో భాగమైన సాక్ష్యులు పంప్ ఆపరేటర్ అన్వర్,సపాయి కార్మికుడు తాడెం చంద్రయ్య,గ్రామస్తులు బూడిద సమ్మయ్య, కండె నరేష్‌లను,అలాగే గ్రామ పంచాయతీ కార్యదర్శి రమాదేవిని ఆ రోజు జరిగిన ఘటనపై ఏసీపీ వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు.

గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-మంథని : మంథని ఎమ్మెల్యే అభ్యర్థి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు కాకర్లపల్లితో పాటు పలు గ్రామలలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో ప్రతులను విడుదల చేసి బీఆర్ఎస్ నాయకులు గడపగడపకు ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో, పుట్ట మధూకర్ మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ అమలు చేస్తున్న పథకా లపై కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్. రైతుబంధు.రైతు బీమా. దళిత బంధు పథకాలపై విస్తృతంగా ప్రజలకు వివరించారు. పుట్ట మధుకర్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిని వివరించారు. పుట్ట మధును అత్యధిక మేజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు వేల్పుల గట్టయ్య,మండల బీసీసెల్ ఉపాధ్యక్షుడు ఆకుల మల్లయ్య, ఉపసర్పంచ్ మహేందర్‌లు పాల్గొన్నారు.

బియ్యం వితరణ



సుల్తానాబాద్-నవ తెలంగాణ : సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో ఇటీవల మృతి చెందిన రాజమ్మ కుటుంబానికి గురువారం అవార్డు కౌన్సిలర్ వర ప్రదీప్ 25 ఏళ్ల బియ్యాన్ని వితరణ చేశారు కౌన్సిలర్ వెంట దేవేందర్ కుమార్ ,దుర్గయ్య, శ్రీనివాస్, హేమన్ రాజు ఉన్నారు.

అనాధలకు దుప్పట్లు పంపిణీ



నవతెలంగాణ-సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణంలో నివాసం లేని అనాధలు రోడ్డుపై చలికి వణుకుతున్న దృశ్యాన్ని చూసి చలించిన ప్రభాస్ ఫ్యాన్స్, యువ సంకల్ప ఫౌండేషన్ సభ్యులతో కలిసి కొంతమంది అనాధలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజ్‌కుమార్ మాట్లాడుతూ రోడ్లపై అనాధలు చలికి వణుకు పడుకోవడం చూసి వారికి తోచిన సాయం చేయాలని ఉద్దేశంతో దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాస్ ఫ్యాన్స్ సభ్యులు శివ, నిఖిల్, రాకేష్ ప్రసాద్, యువ సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు

పారిశుధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్



నవ తెలంగాణ-సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణంలో గురువారం పలు వార్డ్‌లలో పారిశుధ్య పనుల పట్ల తగు సూచనలు చేస్తూ ఉదయం స్థానిక 3,10,11వార్డ్‌లలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ పారిశుధ్య పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా వార్డ్‌లలో ఎక్కడ చెత్త,ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డ్‌కి తరలించేలా తగు చర్యలు తీసుకోవాలని వార్డ్ ఆఫీసర్స్,శానిటేషన్ సిబ్బందికి సూచించారు.

బీఎస్పీలో చేరిన మాజీ వార్డు సభ్యురాలు



నవతెలంగాణ-సుల్తానాబాద్ : సుల్తానాబాద్ వేంజర్ గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు కొండ రజిత శ్రీధర్ గురువారం హైదరాబాద్ లోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

బీఆర్ఎస్‌లోకి న్యాయవాద దంపతులు



పార్టీ కండువా కప్పుతున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

నవతెలంగాణ-మంథని : మంథనికి చెందిన ప్రముఖ న్యాయవాది పులి అశోక్ దంపతులతో పాటు పవర్‌హౌజ్ కాలనీకి చెందిన ఆకుల వేణు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.గురువారం మంథని పట్టణంలోని అపార్ట్‌మెంట్‌లో కాటం నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయసన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్, మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాద దంపతులు పులి అశోక్, ఆకుల వేణులకు వారు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంథనిలో నాడు నేడు జరిగిన అభివృద్ధికి సంబంధించిన పత్రాలను అందజేశారు.

నవతెలంగాణ 8
పెద్దపల్లి
శుక్రవారం | నవంబర్ 03, 2023 | www.navatelangana.com

ప్రధాన పార్టీలను వదిలి బీఎస్పీలోకి వలసలు

- టీపీసీసీ కార్యదర్శి ఈర్ల కొమురయ్య, పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రామ్మూర్తి బీఎస్పీలో చేరిక
- పెద్దపల్లి నియోజకవర్గంలో పుంజుకుంటున్న బీఎస్పీ



నవతెలంగాణ- పెద్దపల్లి
పెద్దపల్లి జిల్లాలో పెద్దపల్లి నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను నాయకులు వదిలి పెడుతున్నారు. ప్రత్యామ్నాయ పార్టీలవైపు వెళ్తున్నారు.పెద్దపల్లి నియోజకవర్గంలోని పెద్దపెల్లి మాజీ జడ్పీటీసీ టీపీసీసీ కార్యదర్శి ఈర్ల కొమరయ్య పెద్దపల్లి బీఆర్ఎస్ జడ్పీటీసీబండారి రామ్మూర్తిలు గురువారం ఆ పార్టీలను వదిలి బీఎస్పీలో చేరారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ అసంతృప్తులు బీఎస్పీలోకి
కాంగ్రెస్‌లో2014 ఎన్నికలు 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కోసం ఎదురు చూసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి మాజీ జడ్పీటీసీ ఈర్ల కొమురయ్య గత కొంతకాలంగా కాంగ్రెస్‌పై తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం విజయరమణారావునే అభ్యర్థిగా ప్రకటించడంతో బుధవారం పార్టీకి రాజీనామా చేసి గురువారం బీఎస్పీలో చేరారు. అదేవిధంగా పెద్దపల్లి సిట్టింగ్ జడ్పీటీసీ బండారి రామ్మూర్తి గత ఏడాదికాలంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రవర్తన వల్ల తీవ్రమైన అసంతృప్తిలో ఉన్నారు. జడ్పీటీసీ గెలుపొందిన ఆయన మండలంలో చేపట్టిన కొన్ని అభివృద్ధి పనులకు సంబంధించి మరో 20 లక్షలు పెట్టుబడి పెట్టినప్పటికీ బిల్లులు విడుదల చేయించడంతో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పట్టించుకోవడం లేదని అవేదన చెంది పార్టీకి రాజీనామా చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బీఎస్పీ పార్టీలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సమక్షంలో చేరారు.

పెద్దపెల్లి నియోజకవర్గంలో పుంజుకుంటున్న బీఎస్పీ
కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ నుంచి నాయకులు రాజీనామా చేసి బీఎస్పీలో చేరడం వల్ల పెద్దపల్లి నియోజకవర్గంలో క్రమక్రమంగా బీఎస్పీ పుంజుకుంటుంది. బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష ఆధ్వర్యంలో గురువారం బీఎస్పీ రాష్ట్ర కార్యాలయలో. పెద్దపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున బీఎస్పీలో చేరారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలం వడ్డెర కాలనీలో సింగల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్ రావు, మచ్చుపేట మాజీ ఎంపీపీ రైతు బంధు మండల అధ్యక్షుడు అత్తె చంద్రమౌళి ఆధ్వర్యంలో గడప గడపకు బీఆర్ఎస్ పార్టీ కార్యక్ర౯మాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ, మళ్లీ అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ అమలు చేసే మ్యానిఫెస్టోలోని అంశాలపై అవగాహన కల్పించారు. బీఆర్ఎస్ మంథని అభ్యర్థి పుట్ట మధూకర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడగోని సతీష్, ఎంపీటీసీ ఓద్ది తిరుమల తిరుపతి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మేన్ నాంసాని సమ్మయ్య, మార్కెట్ కమిటి డైరెక్టర్ బేద సంపత్, సీనియర్ నాయకులు చిలువెరి భూమయ్య, గాదెస్వామి, తాడురి అంజయ్య,ఇరికిల్ల స్వామి తదితరులున్నారు.



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పద్మశాలీ సంఘం నూతన అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలంలోని కేశనపల్లి గ్రామ పద్మశాలిసంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నాగుల కృష్ణను బీఆర్ఎస్ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు బీఆర్ఎస్ నాయకులు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నూనె కుమార్, పప్పు చంద్రమౌళి, రామగల మధు తదితరులున్నారు.



సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అంతర్గాం మండల గౌడ సంఘం నూతన కమిటీ

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:
తెలంగాణ గౌడ సంఘం అంతర్గాం మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు కోట రవి గౌడ్ నియమించారు. అధ్యక్షులుగా గంగాధరి శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మేరుగు నరేష్‌గౌడ్, ఉపాధ్యక్షులు బుర్ర వెంకటస్వామి గౌడ్, పులి లక్ష్మణ్ గౌడ్, సహాయ కార్యదర్శిగా బురుగు రవి గౌడ్, మండల కార్యదర్శులుగా గోరుక సంతోష్ గౌడ్, రేగుంట సతీష్, సభ్యులుగా మడ్డి మహేష్, సతీష్, తిరుపతి, సతీష్‌లను ఎన్నుకున్నారు.



నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న కోట రవి గౌడ్

కేఎటీలో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

నవతెలంగాణ-గోదావరిఖని:
ఎన్టీపీసీ పీటీఎస్‌లోని శ్రీ చైతన్య పాఠశాలల విద్యార్థులు క్యాట్ (నాలెడ్జ్ అసెస మెంట్‌టెస్ట్) ఒలింపి యాడ్ పరీక్షలో ప్రతిభ కనబరిచారు. 72 విద్యార్థులు మొదటి లెవెల్లో ఉత్తీర్ణులై, సెకండ్ లెవెల్ పరీక్షకు అర్హత సాధిం చారు. మ్యా థ్స్ అసెస్‌మెంట్ టెస్ట్‌లో 26 మంది, ఫిజిక్స్ అసెస్‌మెంట్ టెస్ట్‌లో 23 మంది, కెమిస్ట్రీ అసెస్‌మెంట్ టెస్ట్‌లో 23 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటారు.



అభినందిస్తున్న పాఠశాల అకాడమిక్ ఇన్‌చార్జ్

అక్రమ మద్యంపై కొరడా

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:
తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకై ఎలక్షన్ కమిషన్ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నుంచి రామగుండం ఎక్సైజ్ అధికారులు గుడుంబా, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతున్నారు. రామగుండం ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ సుంకరి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం గతనెల నుంచి నేటి వరకు రామగుండం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 59 గుడంబా కేసులు, ఒక గంజాయి కేసు, 34 అక్రమ మద్యం కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 59 మందిని నిందితులను మరి కొంతమంది అనుమానితులను తహశీల్దార్ల వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు.గుడుంబా తయారు చేసినా, అక్రమంగా మద్యం విక్రయించిన, రవాణా చేసిన చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.



మాట్లాడుతున్న రామగుండం ఎక్సైజ్ సీఐ సుంకరి రమేష్

అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్న ఏకైక సీఎం కేసీఆర్

▸ రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని:
దేశంలోనే అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని, దళితుల అభివృద్ధి కోసం సంపన్న వర్గాల తరహాలో దళితుల జీవితాల్లో వెలుగులు నిండాలని, గొప్ప ఆలోచన చేసిదేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో దళిత బంధును ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం రాత్రి గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా చేపట్టిన ర్యాలీలో చందర్, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్ రావు పాల్గొన్నారు. కోరుకంటి చందర్ మాట్లాడుతూ దళితులు సమాజంలో గొప్పగా జీవించాలని సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత బంధు పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారని అన్నారు. నూతనంగా నిర్మాణం చేసిన తెలంగాణ సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు నామకరణం చేశారని గుర్తుచేశారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. ఈ కార్యక్రమంలో రామ గుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, దళిత సంఘాల జాయింట్ కమిటీ అధ్యక్షుడు మైసరాజేష్, బొంకూరి మధు, కొంకటి లక్ష్మణ్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

రామగుండంను మరింత అభివృద్ధి చేస్తా

మాజీ ఎమ్మెల్యే, రామగుండం స్వతంత్ర అభ్యర్థి సోమారపు



ప్రచారం నిర్వహిస్తున్న సోమారపు సత్యనరాయణ

నవతెలంగాణ-గోదావరిఖని:
నియోజకవర్గ ప్రజలు మరోసారి అవకాశం ఇస్తే... రామగుండంను గతం కంటే మరింత అభివృద్ధి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, రామగుండం స్వతంత్ర అభ్యర్థి సోమారపు సత్యనారాయణ అన్నారు. రామగుండం కార్పొరేషన్ 20వ డివిజన్ అక్బర్ నగర్, రైల్వే స్టేషన్ ఏరియా, భరత్‌నగర్, ఎస్టీ కాలనీలో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తనకు ఈసారి మరో అవకాశం కల్పించాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రామగుండంలో ప్రతి ఇంటికి 24గంటలు మంచినీరు అందించానని, రామగుండం రైల్వే స్టేషన్ మసీద్‌కు సరిపడా నిధులు కేటాయించానని, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు పూర్తి చేశానని, మెరుగైన పారిశుద్ధ్యాన్ని అందించానని తెలిపారు. కార్యక్రమంలో సోమారపు అరుణ్ లావణ్య, మాజీ మేయర్ రాజమణి, కుసుమ, కోదాటి ప్రవీణ్, రాయమల్లు గౌడ్ తదితరులున్నారు.

ఐఎన్‌టీయూసీ ఏరియా ఆసుపత్రి ఫిట్ సెక్రెటరీగా అశోక్

నవతెలంగాణ-గోదావరిఖని:
ఐఎన్‌టీయూసీ ఏరియా ఆసుపత్రి ఫిట్‌సెక్రెటరీగా అశోక్ నియామకం అయ్యారు. గురువారం గోదా వరిఖనిలో జనక్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశం సందర్భంగా ఐఎన్‌టీయూసీ ఏరియా ఆసుపత్రి పిట్ సెక్రెటరీగా అశోక్ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నియామకపు ఉత్తర్వులు అందజేశారు. యూనియన్ ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు సదానందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి, ధర్మపురి, సెంట్రల్ జనరల్ సెక్రెటరీ లక్ష్మీపతిగౌడ్‌లు పాల్గొన్నారు.



నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న జనక్ ప్రసాద్

ఇష్టారాజ్యంగా మట్టి మాఫియా

▸ ఇతర ప్రాంతాల నుంచి రాత్రి వేళల్లో లారీలలో తరలింపు ▸ పట్టించుకోని అధికారులు

నవ తెలంగాణ -సుల్తానాబాద్ రూరల్
సుల్తానాబాద్ మండలంలో మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాల నుంచి సుల్తానాబాద్ పట్టణానికి తరలించి రహస్య ప్రాంతంలో నిలువలు చేసి ఇష్టారాజ్యంగా ఎక్కువ ధరలకు విక్రయిస్తూ లక్షలాది రూపాయలు అర్జిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.ఎదురుగట్టర్యాకల్ దేవుపల్లి గ్రామాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కాంట్రాక్టర్లు సైతం అట్టి మట్టితో తమ యొక్క అవసరాలు తీర్చుకుంటున్నారు. రాయల్టీ చెల్లిస్తున్నామని చెప్పడమే తప్ప, ప్రభుత్వానికి రాయల్టీ కట్టింది ఏమి లేదన్న ఆరోపణలు ఉన్నాయి. సీసీ రోడ్లు సైడ్ డ్రైనేజీలు డాంబర్ రోడ్లకుమట్టి తరలించి ఇట్టి అక్రమ మట్టి ద్వారా లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అభివృద్ధి పనుల పేరుతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ తమ వ్యాపారాన్ని మూడు పూలు ఆరు కాయలుగా కొనసాగిస్తూ అధిక ధరలకు సుల్తానాబాద్ ప్రాంతంలో విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు అక్రమ మట్టి ఇసుక వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రైవేట్ షెటర్స్ ముందు డంపు చేసి ఉన్నా మట్టి

ఆరు నెలల్లో రామగుండంను స్మార్ట్ సిటీగా మారుస్తా

కందుల సంధ్యారాణి

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపిస్తే 6 నెలల్లో రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని స్మార్ట్ సిటీగా మారుస్తానని, లేని యెడల తన పదవికి రాజీనామా చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల సంధ్యారాణి అన్నారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంధ్యారాణి మాట్లాడుతూ... 30 సంవత్సరాల నా రాజకీయ జీవితంలో అవినీతి లేకుండా పనిచేశానని, తనకు అవకాశం కల్పిస్తే నియోజకవర్గ అభివద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. శాంతియుత వాతావరణంలో ఉన్న ఈ ప్రాంతంలో అల్లర్లు సష్టించే విధంగా నాయకులు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు.

నవతెలంగాణ

9

రాజన్న సిరిసిల్ల

శుక్రవారం నవంబర్ 03, 2023 www.navatelangana.com

ఎన్నికల సజావుగా నిర్వహణకు సహకరించాలి

• జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

నవతెలంగాణ-సిరిసిల్లరూరల్:

రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహజన్‌తో కలిసి కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 3న నోటిఫికేషన్ ప్రకటించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. నవంబర్ 10వ తేదీన నామినేషన్ల స్వీకరణ ముగుస్తుందని తెలిపారు. అభ్యర్థులు తమ నామినేషన్లను నవంబర్ 10వ తేదీ సాయంత్రం 3 గంటల లోగా వేయాలన్నారు. కార్యాలయ పని దినాల్లో నవంబర్ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తానని చెప్పారు. 13న నామినేషన్ల స్క్రూటినీ ఉంటుందన్నారు. 15వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు అని చెప్పారు. సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లు స్వీకరిస్తామని, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వేములవాడ తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థుల సౌకర్యార్థం నామినేషన్ కేంద్రాలలో హెల్ప్ డెస్కను కూడా ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ల దాఖలుకు అభ్యర్థితో పాటు ఐదుగురికి (1టు4) కు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఫారం -6 ద్వారా సమర్పించే అఫిడవిట్ లో అన్ని ఖాళీలు పూరించాలని చెప్పారు. నామినేషన్ సమయంలో క్రిమినల్ కేసులు, కన్విక్షన్ కేసుల వివరాలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా లో 3 సార్లు పబ్లిష్ చేయాలన్నారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ మాట్లాడుతూ నామినేషన్ కేంద్రం నుంచి 100 మీటర్ల దూరం వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

• కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

తంగళ్లపల్లి మండలంలో బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహజన్‌లు బుధవారం సంయుక్తంగా పరిశీలించారు. స్ట్రాంగ్ రూంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు అన్ని వైపులా ఉండాలని సూచించారు. సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ ఒకే చోట ఉన్నందున లే అవుట్ ప్రకారం రెండు నియోజకవర్గాల ఎన్నికల కౌంటింగ్‌కు వేర్వేరుగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అన్నారు. లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన భద్రతకు సంబంధించి పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ సూచనలు ఇచ్చారు. జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్ ఉన్నారు.

ముస్లిం మైనారిటీల అభివృద్ధి సీఎం కృషి

నవతెలంగాణ-సిరిసిల్లరూరల్:



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డాక రాష్ట్రంలోని ముస్లింలకు దశాబ్దాల నుంచి ఏ ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాలతో పాటు ముస్లింలకు తగిన ప్రాధాన్యత ఇస్తూ ముస్లింల జీవితాల్లో వెలుగులు నింపిన ప్రభుత్వం తెరాస ప్రభుత్వమేనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం సీనియర్ నాయకులు ముజీబ్ ఆధ్వర్యంలో ప్రచురించిన ముస్లింల అభివృద్ధి కర పత్రాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య రాష్ట్ర నాయకులు చీటీ నర్సింగరావు, టెస్కాబ్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మైనారిటీ పట్టణ అధ్యక్షుడు చాంద్ పాషా, మైనారిటీ నాయకులు సత్తార్, మహమూద్, అంజద్‌లు పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు యూనస్, మోహిన్, సాజిద్, రఫియొద్దీన్, రఫీ, కృష్ణ, సామల శ్రీను పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయంపై దాడి ఘటనపై 11 మందికి జైలు

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్: ప్రభుత్వ కార్యాలయంపై దాడి కేసులో 11 మందికి ఒక్కొ క్కరికి సంవత్సరం సాధారణ జైలు శిక్షతో పాటు 3000 రూపాయల జరిమానా విధిస్తున్నట్లు సిరిసిల్ల ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రవీణ్ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... 2017 మార్చ్ 19 మధ్యాహ్నం కోనరావుపేట తహసీల్దార్ కార్యాలయంలో నిమ్మపల్లికి చెందిన విమల, చంద్రకళ, దేవయ్య, రాజయ్య సత్తయ్య పూజమ్ రాజయ్య, గంగాధర్, లింగయ్య, లచ్చయ్య, మధు, జవ్వాజ్ గంగాధర్ అను వ్యక్తులు కార్యాలయంలోకి దౌర్జన్యంగా చొరబడి సిబ్బందిని బయటకు వెళ్లగొట్టి కార్యాలయంలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి భయానక వాతావరణం సృష్టించారన్నారు. అప్పటి తహసీల్దార్ డి. నాగరాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు అధికారి, ఎస్ఐ ఎం. మాలకొండల రాయుడు, కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేసి చార్జి షీట్ దాఖలు చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-వీర్నపల్లి:



పరామర్శిస్తున్న నాయకులు

వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన భూక్య మోహన్ కుటుంబాన్ని గురువారం నాఫ్సాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీటీసీ కళావతి, ఎంపీపీ భూలా, సర్పంచ్ లింగం మహిళా అధ్యక్షురాలు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ చాంద్ పాషా, సెస్ డైరెక్టర్ మల్లేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, ఎంపీటీసీ రేణుక, బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌నాయక్, యూత్ మండల అధ్యక్షుడు సామల్ల దేవరాజు పాల్గొన్నారు.

ఎంఈవోకు వినతి పత్రం అందజేత

నవ తెలంగాణ-బోయినిపల్లి

మధ్యాహ్నం భోజన కార్మికులకు వేతనాలు పెంచా లని గురువారం భోజన కార్మి కులు ఎంఈవో శ్రీనివాస దీక్షి తులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ చాలీ చాలని జీతంతో మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనికి తగ్గ సరైనవేతనం కార్మికులకు ఇవ్వాలని అధికారులను కోరారు. కార్మికులు పోశయ్య, సుగుణ, భారతమ్మ, ఎల్లయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-బోయినిపల్లి



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మండల కేంద్రంలో పలు గ్రామాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జోగినపల్లి రవీందర్ రావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అభ్యర్థి సుంకే రవిశంకర్‌కి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రవీందర్‌రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు పక్షపాతి అని రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సురేందర్, మండల అధ్యక్షుడు కే కొండయ్య, ఎంపీపీ వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పేరుతో... నేతన్నల బతుకులు ఆగం

• హిందూ సాంస్కృతిక సమితి జిల్లా అధ్యక్షుడు పత్తిపాక సురేష్

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:

బతుకమ్మ చీరల పేరుతో నేతన్నల బతుకులు ఆగం కేటీఆర్ ఆగం చేసిండని హిందూ సాంస్కృతిక సమితి జిల్లా అధ్యక్షుడు పత్తిపాక సురేష్ మండిపడ్డారు. గురువారం జిల్లా కేంద్రంలోని లహరి గ్రాండ్ కల్యాణ మండపంలో హిందూ సాంస్కృతిక సమితి జిల్లా అధ్యక్షుడు పత్తిపాక సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మశాలీల ఆత్మ గౌరవ సభలో చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, కొండ లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పించారు. జై పద్మశాలి.. జై మార్కండేయ అనే నినా దాలతో సభ దద్దరిల్లింది. ఈ సందర్భంగా వీర మోహన్ మాట్లాడుతూ మార్పు నాంది ప్రస్తావన చేస్తూ ఒక యువకుడు ఎమ్మెల్యే పోటీకి రావడం సంతోషంగా ఉందన్నారు. సిరిసిల్లలో ఎన్నడూ కూడా పద్మశాలీలకు నాయకత్వం లేదనీ, స్థానికుడు కాని కేటీఆర్ తమ ఓట్ల తో గెలిచి తమపై అధికారం సాగిస్తున్నారన్నారు. సిరిసిల్లలో అత్యధికంగా ఉన్న పద్మశాలీలకు బీఆర్ఎస్ టికెటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హిందూ సాంస్కృతిక సమితి జిల్లా అధ్యక్షుడు పత్తిపాక సురేష్ మాట్లాడుతూ ఏడున్నర దశాబ్దాలుగా సిరిసిల్ల ప్రాంతాన్ని పరాయివాళ్లు ఏలుతున్నరన్నారు. తమ ఓట్లు తామే వేసుకుంటే గెస్తుస్తామని, ఒక్కసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వ్యవస్థాపకులు



మాట్లాడుతున్న చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీర మోహన్

వాసాల లక్ష్మీనారాయణ, రాష్ట్ర పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలు వేదాశ్రీ, కౌన్సిలర్ పద్మ, బిసి సంఘం రాపెల్లి ఆనందం, ఆర్ఎంపీ, పీఎంపీ అసోసి యేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మిట్టపల్లి రాజమల్లు, పద్మశాలి నేతలు రాపల్లి ముకుందం, గుడ్ల విష్ణు పాల్గొన్నారు.

ఒక్క ఛాన్స్ ఇవ్వండి అభివృద్ధి చేస్తా...

• కాంగ్రెస్ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట

ఒక్క ఛాన్స్ తనకు ఇవ్వండి.. ఈ ప్రాంత బిడ్డగా ఇక్కడే పుట్టిన వ్యక్తిని బతికిన, సచ్చిన చివరి వరకు మన ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉంటానని సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రములో గౌడ సంఘం సమావేశం జరుగగా గౌడ కులస్తులను కలిసి కేకే మహేందర్‌రెడ్డి ఓట్లు అభ్యర్థించారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్



గౌడ సంఘ సభ్యులతో మాట్లాడుతున్న కేకే

అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు షేక్ గౌస్, రేవంత్‌రెడ్డి టీం జిల్లా అధ్యక్షుడు గూడ విజయ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల కృష్ణ, జిల్లా కార్యదర్శి పందిర్ల లింగంగౌడ్ పాల్గొన్నారు.

యువ ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ/ గంభీరావుపేట: మండల కేంద్రంలో 6న నిర్వహించనున్న మంత్రి కేటీఆర్ యువ ఆత్మీయ సమ్మేళనము పోస్టర్‌ను గురువారం జిల్లా యువజన నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ నాయకులు జక్కుల నాగరాజు యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, సంతోష్ గౌడ్, మండల యూత్ అధ్యక్షులు ఎడబోయిన రత్నాకర్, ప్రధాన కార్యదర్శి చిట్టెంపల్లి బిక్షపతి పటేల్ జిల్లా టిఆర్ఎస్వీ నేత సికిందర్ అధ్యక్షులు స్వామి విష్ణు శ్రీమాన్ సతీష్ సాయి రెడ్డి యూత్ నాయకులు హరీష్ మహేందర్ రాకేష్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సహకార సంఘం డైరెక్టర్ రాజు

నవతెలంగాణ-వేములవాడ:

వేములవాడ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సహకారక సంఘం డైరెక్టర్ తోటరాజు గురువారం కాంగ్రెస్ తీర్థాం పుచ్చుకున్నారు. వేములవాడలో ఏఐసీసీ సభ్యులు మంజునాథ్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు, వేములవాడ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు.



నియామకపత్రం అందజేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ పట్టణానికి చెందిన గంజి జైపాల్ రెడ్డిని జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా నియామకం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ నియామకం పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, నాయకులు చిలక రమేష్, కూరగాయల కొమరయ్య, పాత సతి లక్ష్మి, కనికరపు రాకేష్ ఉన్నారు.

సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా..

• వేములవాడ పట్టణ సీఐ కరుణాకర్

నవతెలంగాణ-వేములవాడ: శాసనసభ ఎన్నికల సందర్భంగా సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన వివాదాస్పదమైన పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ పట్టణ సీఐ కరుణాకర్ హెచ్చరించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల గడువు దగ్గర పడుతున్న తరుణంలో కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా ఎదు టి వారిని రెచ్చగొట్టే విధంగా అభ్యంతరకరమైన పోస్టులు పెడుతున్నార న్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగే విధంగా ప్రతి ఒక్క రూ బాధ్యతతో వ్యవహరించి సహకరించాలని సీఐ కరుణాకర్ విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌లో నూతన నియామకాలు

బోయినిపల్లి-నవతెలంగాణ:



నియామక పత్రం అందజేస్తున్న మేడిపల్లి సత్యం

బోయినిపల్లి మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా గడ్డి కమల్ కార్యదర్శిగా మండల వంశీలు నియామకం అయ్యారు. వీరికి చొప్పదండి నియోజకవర్గం శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం, బీసీ సెల్ అధ్యక్షుడు కుస రవిందర్‌లు వీరికి నియామక పత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి వంశీ పాల్గొన్నారు

కాంగ్రెస్‌లో చేరికల జోరు

నవ తెలంగాణ-బోయినిపల్లి:

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ మండల కార్యాలయంలో చేరికల జోరు కొనసాగుతుంది. గురువారం ఇతర పార్టీల్లో నుంచి 100 మందికి పైగా నాయకులు కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం చేతుల మీదుగా కాంగ్రెస్‌లో చేరారు. మల్లాపూర్ గ్రామ ఉపసర్పంచ్ అనిత-నాగరాజ్, మల్లాపూర్ గ్రామ ఐదుగురు వార్డు సభ్యులు వేసిరెడ్డి అమర్నాథ్ రెడ్డి, అద్దంకి మాధవి రమేష్, ఐల శివరామ్, మండల మహిమ్మ రవి, మంత్రి లచ్చయ్య, మానువాడ కోపరేటివ్ బ్యాంక్ సింగిల్ విండో డైరెక్టర్ ఆకుల రవి, మాల సంఘం అధ్యక్షుడు బాబు, మోహన్‌లు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమ్‌రెడ్డి మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్ కుట్రలను కట్టడి చేయాల్సిన బాధ్యత మీదే

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్

నవతెలంగాణ-మంథని

సామాన్య కుటుంబంలో పుట్టిన తాను కళ్ల ముందే ఇంత స్థాయికి ఎదిగానని, కాంగ్రెస్ వాళ్లు కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మంథని మున్సిపల్ పరిధిలోని ఎరుకలగూడెం, చైతన్యపురి కాలనీ,పద్మశాలి వీధి,కూచిరాజ్పల్లి,గంగాపురి, లైన్గడ్డలలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్లలో మున్సిపల్ చైర్పర్సన్ పుట్ట శైలజతో కలిసి మాట్లాడారు.గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకుల అబద్దాలు నమ్మి మోసపోయారని,మళ్లీ ఎన్నికలు వచ్చాయని నోట్ల సంచులతో వచ్చి తనపై అపవాదులు వేస్తున్నారని,వాళ్ల మాటలు నమ్మి ఆగం కావద్దని ఆయన అన్నారు.తనను చిన్న తనం నుంచి చూస్తున్నారని,తాను ఎలాంటి వాడినో అందరికి తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ కుట్రలు, కుతంత్రాలను కట్టడి చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. నాలుగేండ్లు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి చేశానని ఆయన గుర్తు చేశారు. మంథని మండలంలో ప్రచారం మొదలుపెట్టే ముందు మీ ఆశీర్వాదం తీసుకోవాలని ఈ మీటింగ్లు ఏర్పాటుచేయడం జరిగిందని,మీరంతా ఆశీర్వదించి ఆదరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు,వార్డు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు,భారీ ఎత్తున పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పుట్ట మధు

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను మ్యానిఫెస్టోలో చేర్చాలి

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ:


వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఈ ఎన్నికల్లో పోటీ చేయబోయే ఎమ్మెల్యే అభ్యర్థులు సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలకు సంబంధించి జీవో నంబర్ 22 లేదా కోల్ఇండియా వేతనాలు అమలు చేస్తామని తమ మ్యానిఫెస్టో పెట్టాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ విషయమై గురువారం సోమారపు సత్యనారాయణని మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సోమారపు సత్యనారాయణ మాట్లాడుతూ సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా వేతనాలు అమలయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆర్జీ-2 డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు అయిలవేన భూమయ్య, చల్లూరి లక్ష్మీనారాయణ,సహాయ కార్యదర్శి అడ్లూరి రామన్న, వేల్పుల రవి తదితరులు హాజరయ్యారు.

మంథనిలో బీజేపీ పార్టీ జెండా ఎగవేస్తాం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందుపట్ల సునీల్ రెడ్డి

నవతెలంగాణ-మంథని


మాట్లాడుతున్న సునీల్రెడ్డి

అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ పార్టీ జెండా ఎగురేసి తీరుతామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల సునీల్ రెడ్డి అన్నారు. మంథని పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సునీల్ రెడ్డి మాట్లాడుతూ మంథని ప్రజలు మార్పు కోరుకుంటున్నారని,పేద ప్రజల బతుకుల్లో మార్పులు రావాలంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.ఒకసారి బీజేపీ పార్టీకి అవకాశం ఇచ్చి నన్ను గెలిపించాలని ఆయన కోరారు.కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్కామోహన్,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొండపాక సత్య ప్రకాష్, కో కన్వీనర్ నాంపల్లి రమేష్,మండల అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీలో పలువురి చేరిక

నవ తెలంగాణ -సుల్తానాబాద్ రూరల్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రవీణ్కుమార్

సుల్తానాబాద్ పట్టణానికి చెందిన మాజీ వార్డు సభ్యురాడు కొండ రజిత, ఆరెపల్లి మధు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సమక్షంలో పెద్దపల్లి అసెంబ్లీ బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉష ఆధ్వర్యంలో బీఎస్పీ పార్టీలో చేరారు. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దాసరి ఉష మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి బీఎస్పీని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు.

ప్రజలందరూ బీఆర్ఎస్వైపే..

పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

నవ తెలంగాణ -సుల్తానాబాద్ రూరల్ (ఎలిగేడు)


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజలందరూ బీఆర్ఎస్ పార్టీవైపే ఉన్నారని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. ధూళికట్ట జనం గెలుపుపై ధీమా ఇచ్చారని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామంలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం మనోహర్రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని, పెద్దపల్లిలో సైతం గులాబీ జెండా ఎగురుతుందన్నారు. ఆయన వెంట ఎంపీపీ తానిపర్తి స్రవంతి-మోహన్రావు, జడ్పీ వైస్ చైర్ పర్సన్ మండిగ రేణుక -రాజానర్సు, మండల పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, రైతు సమితి మండల కో-ఆర్డినేటర్ సుధాకర్ రావు,మండల సర్పంచ్లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

కోరుకంటి గెలుపు నల్లేరు మీద నడకే

పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్


మాట్లాడుతున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్

నవతెలంగాణ-గోదావరిఖని:

ఇండిపెండెంట్గా గెలిచిన చరిత్ర ఉన్న కోరుకంటి చందర్కు ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ తోడుందని, ఆయన గెలుపు నల్లేరు మీద నడకేనని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. గోదావరిఖని చౌరస్తా సమీపంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో కోరుకంటి చందర్తో కలిసి ఆయన మాట్లాడారు. రెండేళ్ళ కాలం కరోనాతో పోను, రెండున్నరేళ్ల కాలంలోనే ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మెడికల్ కళాశాల, ఐటీ పార్క్, ఇండస్ట్రీయల్ పార్క్, తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. 80కిపైగా సీట్లతో బీఆర్ఎస్ రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చే 5 గంటల కరెంటు కావాలా.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చే 24 గంటల కరెంటు కావాలా తేల్చుకోవాలన్నారు. అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే కారు గుర్తుకే ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, రాష్ట్ర నాయకురాలు మూల విజయా రెడ్డి, శంకర్, కాంపెల్లి సతీష్ పాల్గొన్నారు.

చందర్ గెలుపును ఆపలేరు

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ:


పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయాచంద్ర శేఖర్

ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా రామగుండంలో కోరుకంటి చందర్ గెలుపును ఆపలేరని బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు విజయా చంద్ర శేఖర్ అన్నారు. గురువారం 15వ డివిజన్ ఇన్చార్జీ గుగులోత్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమంలో దేశం గర్వించే స్థాయిలో తెలంగాణ రాష్ట్రం ఉందన్నారు. రామగుండం మరింత అభివృద్ధి జరగాలంటే రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటుకు వేసి కోరుకంటి చందర్ని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు.ఈ ప్రచారంలో రాజీవ్ నగర్లో 100 మంది మహిళలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

నామినేషన్ ప్రక్రియపై మీడియా సమావేశంలో వెల్లడించిన పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి

నవ తెలంగాణ -పెద్దపల్లి

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమవుతుంది. నేడు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో నామినేషన్ల ప్రక్రియ మొదలై నవంబర్ 10 వరకు నామినేషన్ లు స్వీకరించనున్నారు. అందుకోసం నామినేషన్లు వేసేందుకు అన్ని పార్టీల అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ పోలింగ్ సంబంధించిన ఏర్పాట్లన్నీ జిల్లా ఎన్నికల అధికారులు పూర్తి చేశారు. నామినేషన్ పత్రాలు సమర్పణ సమయంలో అభ్యర్థులు జాగ్రత్తలు పాటించాలని పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి మధుమోహన్ అన్నారు. గురువారం పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణపై పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి మధుమోహన్ మీడియా సమావేశం నిర్వహించి చేసిన ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత ఎన్నికల కమిషన్ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ అక్టోబర్ 9న విడుదల చేసిందని, జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని, సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు పకడ్బందీగా తీసుకుంటున్నా మని అన్నారు. నామినేషన్ పత్రాలను నవంబర్ 3 నుంచి 10 వరకు పని దినాలలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో స్వీకరిస్తామని అన్నారు.నవంబర్ 13న నామినేషన్ల స్క్రూటిని కార్యక్రమం ఉంటుందని , నవంబర్ 15 వరకు నామినేషన్ పత్రాలు ఉపసంహరణ గడువు ఉంటుందని, నవంబర్ 15న సాయంత్రం స్వతంత్ర అభ్యర్థులకు, గుర్తింపు లేని పార్టీల అభ్యర్థులకు గుర్తులు కేటాయించి పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని అన్నారు.

మంథని బీజేపీ అభ్యర్థిగా చందుపట్ల సునీల్రెడ్డి

నవతెలంగాణ-మంథని



మంథని నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా చందుపట్ల సునీల్ రెడ్డిని బీజేపీ అధిష్టానం ప్రకటించింది. చందుపట్ల సునీల్ రెడ్డిని ఖరారు చేయడంతో పార్టీ శ్రేణులలో జోష్ నెలకొంది. మంథని బరిలో కాంగ్రెస్ నుంచి దుద్దిళ్ల శ్రీదర్బాబు, బీఆర్ఎస్ నుంచి పుట్ట మధు, బీజేపీ నుంచి సునీల్రెడ్డి పోటీలో ఉండడంతో ఇక్కడ పోరు ఆసక్తిగా మారింది.

రామగుండంలో గులాబీ జెండా ఎగరవేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలి

రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని:



రామగుండం నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరవేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. గురువారం ఎన్టీపీసీ లక్ష్మీ నరసింహ గార్డెన్స్లో మూర్మూర్ మాజీ సర్పంచ్ గోపు కోమురయ్య యాదవ్, యాదాల రాజు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అదేవిధంగా అంతర్గాంకు చెందిన యువకులు నందా సంజీవ్, సాగర్, అనిల్, సాయి, వీర్రాజు, నాయకులు కోల సంతోష్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై ప్రజలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. మన బతుకులు బీఆర్ఎస్ పార్టీతోనే మారుతాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వివరించాలని, బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రజలకు తెలిపి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు కృషిచేయాలన్నారు.

31వ డివిజన్లో కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:

రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్సింగ్ రాజ్ఠాకూర్ను ఈ సారి ఆశీర్వదించి గెలిపించాలని కోరుతూ 31వ డివిజన్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను వివరిస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. 31వడివిజన్ కమిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాదరబోయిన రవి కుమార్, సుతారి లక్ష్మణ్బాబు, యాదవ వెంకట రమణ, పిల్లి రాజమౌళి, చందా చంద్రమోహన్, గడ్డం వెంకటేశ్వర్లులు పాల్గొన్నారు.

సిరిసిల్ల తరహాలో గర్షకుర్తిని అభివృద్ధి చేస్తాం

- హామీలు కాదు ఆచరణలో చూపిస్తా
- చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి సత్యం

నవతెలంగాణ - గంగాధర

సిరిసిల్ల తరహాలో గర్షకుర్తి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని టీపీసీసీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం గర్షకుర్తిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సత్యం గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ గర్శకుర్తిని మండల కేంద్రంగా ఏర్పాటుకు అన్ని రకాలుగా సహకరిస్తామని అన్నారు. నిరాహార దీక్షను విరమింపజేసి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ముఖం చాటేశారని విమర్శించారు. రెండుసార్లు ఓటమి చెందినా ఆందోళన చెందకుండా పదేండ్లుగా చొప్పదండి నియోజకవర్గం ప్రజల మధ్యలో ఉంటూ ఇక్కడి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నానని అన్నారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేసే బాధ్యతను తీసుకుంటానని హామీ నిచ్చారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేసి తీరుతుందన్నారు.


ఓటు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం

అనంతరం మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో 100 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గంగాధర మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, నాయకులు రామిడి రాజిరెడ్డి, రోమల రమేష్, బుర్గు గంగన్న, చిప్ప లావణ్య, చక్రపాణి, వొడ్నాల యగ్నేష్, బత్తిని సత్యనారాయణ, శ్రీధర్, గుండ రాజేశం, మల్లికార్జున్, వీరేశం, షాదుల్ల, కరీం పాల్గొన్నారు.

70 సంవత్సరాలలో ఏ ఎమ్మెల్యే చేయని అభివృద్ధి చేశా

బీఆర్ఎస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్



నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి నియోజకవర్గంలో 70 సంవత్సరాలలో ఏ ఎమ్మెల్యే చేయని అభివృద్ధి చేశానని బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1, 2, 3 వార్డుల్లో గురువారం రాత్రి ఆయన ప్రచారం చేశారు. మాట్లాడుతూ కాంగ్రెస్ కు ఓటు వేస్తే కారు చీకట్లే అని, బీజేపీకి ఓటు వేస్తే తెలంగాణ రాష్ట్రం పది సంవత్సరాలు వెనుకకు పోతుందన్నారు. చొప్పదండి మున్సిపాలిటీ ఎన్నికల్లో రూ.20కోట్లతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చిన, 120 కోట్లతో సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ, రోడ్లు, సిసి రోడ్లు, ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్ వెజ్ మార్కెట్, 100 పడకల ఆస్పత్రి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి పనులు చేశానని అన్నారు. మరోసారి కారు గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అశోక్



నవతెలంగాణ - జమ్మికుంట

కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన మేకమల్ల అశోక్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కవంపల్లి సత్యనారాయణ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాచపల్లి రమేష్, ఆసాల సుధీర్, చంద్రమౌళిగౌడ్, నాగాండ్ల నరేష్, రాములు, బిక్షపతి ఉన్నారు.

ఘనంగా బల్మూరి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - జమ్మికుంట

ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నర్సింగరావు జన్మదిన వేడుకలను జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని స్పందన అనాథ ఆశ్రమంలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వరరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు, పండ్లు, కూరగాయలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు రాచపల్లి రమేష్, సుధీర్, చంద్రమౌళిగౌడ్, నాగాండ్ల నరేష్, రాములు పాల్గొన్నారు.

బాలవికాస సంస్థకు రూ.5వేల విరాళం

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట బాలవికాస కేంద్రానికి ఐదువేల రూపాయలను సెంటర్ మేనేజర్ పబ్బు సులోచనకు గురువారం టిజిపిఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభు అందజేశారు. ఇలాంటి సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు చేస్తున్న పబ్బు సులోచనను ఆయన అభినందించారు.

మాదిగల హక్కులను పట్టించుకోని ప్రభుత్వం

మాదిగ హక్కుల దండోరా



నవతెలంగాణ - హుజురాబాద్

రాష్ట్రంలో మాదిగల హక్కులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేకుంట సునీల్ అన్నారు. గురువారం హుజూరాబాద్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేయని కౌశిక్‌రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇచ్చిందని.. ఆయనకు ఓట్లు అడిగే అర్హత లేదని అన్నారు. సమావేశంలో మాదిగ హక్కుల దండోరా వర్కింగ్ ప్రెసిడెంట్ కవ్వంపల్లి రవీందర్, ఎలుకపెల్లి జనార్ధన్, జిల్లా అధ్యక్షుడు మాట్ల రమేష్ పాల్గొన్నారు.

పాత గ్రామపంచాయతీ వద్ద తాత్కాలికంగా గొర్రెలు, మేకల వారసంత

నవతెలంగాణ - చొప్పదండి

శాసనసభ సాధారణ ఎన్నికల దృష్ట్యా నేటి నుండి అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానునందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కూరగాయల, గొర్రెల, మేకల వారసంతను తాత్కాలికంగా పాత గ్రామపంచాయతీ వద్ద నిర్వహిస్తామని గురువారం మున్సిపల్ కమిషనర్ పి.శాంతి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ కార్యాలయం నుండి 100 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలు ఉంటుంది. కాబట్టి కార్యాలయం ముందు ప్రతి శుక్రవారం కూరగాయల, శనివారం గొర్రెలు, మేకల వారసంతను ఈ నెల 30వరకు చొప్పదండి పాత గ్రామ పంచాయతీ ముందు ఖాళీ స్థలంలో నిర్వహించాలని సూచించారు.

బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



నవతెలంగాణ - తిమ్మాపూర్

తిమ్మాపూర్ మండలం పోలంపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో గురువారం సైదాపూర్ మండలం పెరికపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ప్రమోషన్‌పై వెళ్లిన దొంత శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు వంగ శ్రీనివాస్ మాట్లాడుతూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాడ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రసమయి గెలవాలని మేడారంలో పూజలు



నవతెలంగాణ - తిమ్మాపూర్

మానకొండూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్ భారీ మెజారిటీతో గెలుపొందాలని పోలంపల్లి నాయకులు మాజీ ఎంపీటీసీ పేరుక రవీందర్, సీనియర్ నాయకులు బండారి కుమారస్వామి మేడారంలోని సమ్మక్క సారలమ్మను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహమ్మద్ రఫీ, ఖమ్మం తిరుపతి, మల్లేశం, పడాల శ్రీకాంత్, దొబ్బల కుమార్ పాల్గొన్నారు.

నూతన నియామకం

నవతెలంగాణ - తిమ్మాపూర్ : బీజేపీ కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా తిమ్మాపూర్ మండలం మక్తపెల్లికి చెందిన చింతం శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరక జిల్లా అధ్యక్షుడు గంగాడి కష్ణారెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు



నవతెలంగాణ - గన్నేరువరం

మండలంలోని మైలారం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, ప్రస్తుత కేడీసీసీ డైరెక్టర్ పురంశెట్టి బాలయ్య తన ముఖ్య కార్యకర్తలతో డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బాలయ్య చేరికతో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఆయనకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ గువ్వ వీరయ్య, బీసీసెల్ ఉపాధ్యక్షుడు వరాల మల్లేశం, సీనియర్ నాయకుడు వరాల సత్తయ్య యువ నాయకుడు పురంశెట్టి రమేష్, నూకల ప్రవీణ్, తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మైలారం సర్పంచ్ దుడ్డు రేణుకమల్లేశం, ఉపసర్పంచ్ సముద్రాల జానీకరిష్మా, వరాల సత్తయ్య, మైసంపల్లి తిరుపతి, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, ఓదేలు, కోటి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బండి సంజయ్ వాహనం తనిఖీ



నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలోని రేణిగుంట టోల్ ప్లాజా వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ వద్ద ఎంపీ బండి సంజయ్ వాహనాన్ని ఎన్నికల అధికారులు ఆపి తనిఖీ చేశారు. హైదరాబాదు నుండి కరీంనగర్ వస్తున్న ఎంపీ వాహనాన్ని తనిఖీ చేయగా సిబ్బందికి సహకరించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలి


02జమ్మికుంట4బీ మాట్లాడుతున్న రాచపల్లి సాగర్

నవతెలంగాణ - జమ్మికుంట

ఈ నెల 4న కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జరిగే కరీంనగర్ ఉమ్మడి జిల్లా చలో ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి రాచపల్లి సాగర్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఆయనవెంట నాయకులు పోడేటి వేణు, సలీగంటి సతీష్, వడ్లూరీ అరుణ్, మొలగురి రాజేందర్, శనిగరం తరుణ్ కుమార్, రాచపల్లి వంశీ, రాచపల్లి రజనీకుమార్ ఉన్నారు.